FOR ADS.......

ఆకాంక్ష

CONTACT:
8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట,
జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...

8333818121

ఎడిటర్
పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష
akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :208 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ ఆదివారం- 22 - మార్చి - 2026

# తెలుగు రాష్ట్రాల్లో కొండెక్కిన కోడి ధర..



ఒక్క రోజులోనే భారీగా ధరలు పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.

విజయవాడలో స్కిన్ లెస్ చికెన్ కిలో ధర రూ. 380 నుండి రూ. 400 వరకు పలుకుతోంది.

హైదరాబాద్ లో కిలో చికెన్ రూ. 340 నుండి రూ. 350 మధ్య విక్రయిస్తున్నారు.

అమరావతి : తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ప్రియులకు ఆదివారం భోజనం భారంగా మారబోతోంది. నిన్నటి వరకు సాదాసీదాగా ఉన్న మిగతా..2లో

# భద్రాచలం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి కొండా సురేఖ



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరియు పట్టణ సమగ్ర అభివృద్ధి పై మంత్రి కొండా సురేఖ సమీక్షా సమావేశం నిర్వహించారు.

హైదరాబాద్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరియు పట్టణ సమగ్ర అభివృద్ధి పై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని తన చాంబర్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జాటోత్ రామచంద్ర నాయక్ లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. "భద్రాచలం పునర్‌నిర్మాణం మరియు పునరుజ్జీవనం" ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రణాళికల పై చర్చించారు. మిగతా..2లో

## కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్



- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- అంజన్న ఆశీర్వాద యాత్ర' ముగింపు సమయానికి ఆలయం మూసివేయడంతో, అప్పట్లో ఆయన ముఖద్వారం వద్దే మొక్కు తీర్చుకున్నారు.

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న సన్నిధిలో నేడు ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటీ కూడా

# ఇప్పటివరకు అమలు కాలేదు

- బీఆర్ఎస్ సీనియర్ నేతలు, లీగల్ సెల్ విభాగంతో కేటీఆర్ సమావేశం
- ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత అంశంపై ప్రైవేట్ మెంబర్ బిల్లుపై చర్చ
- గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ ప్రైవేటు మెంబర్ ప్రవేశపెట్టనున్నామని వెల్లడి



హైదరాబాద్: ఆరు గ్యారంటీలపై సీఎం రేవంత్ రెడ్డి సంతకం చేసిన దస్త్రం కనిపించకుండా పోయిందన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం 4 కోట్ల మందికి టోపీ పెట్టిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు, లీగల్ సెల్ విభాగంతో కేటీఆర్ సమావేశం అయ్యారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత అంశంపై ప్రైవేట్ మెంబర్ బిల్లుపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. శుక్రవారమే ప్రైవేటు బిల్లు : సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం రోజున 6 గ్యారంటీల దస్త్రంపై సంతకం చేశారని, అభయహస్తం అనే దస్త్రంపై రేవంత్ రెడ్డి తొలి సంతకం చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. గవర్నర్ ప్రసంగంలోనూ ఆరు గ్యారంటీలపై సంతకం జరిగిందని చెప్పించారని, ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటీ కూడా ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టనున్నామని ప్రకటించారు. వచ్చే శుక్రవారం నాడు శాసనసభలో తాము ప్రైవేటు బిల్లు పెట్టాలని నిర్ణయించామని, తాము సభలో బిల్లు ప్రవేశపెట్టేలా అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నామని అన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన అంశమే అయినందున మిగతా..2లో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ

- జిల్లాలో సగం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని, మూడుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మండిపడ్డారు.
- కానీ అదే కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ వాళ్లు కూలేశ్వరంగా అభివర్ణించారని మండిపడ్డారు.



హైదరాబాద్: సిద్దిపేట అభివృద్ధికి నిధులు రద్దు చేశారని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేపు సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో ఆయన పలు ప్రశ్నలతో బహిరంగ లేఖ రాశారు. సిద్దిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం తాము చేస్తే శిలాఫలకం మిగతా..2లో

## ఇరాన్ పై దాడులను ఖండించడంలో మోదీ సర్కార్ విఫలం- ఇది పిరికితనానికి, ద్రోహానికి నిదర్శనం



- ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఖండించడంలో మోదీ ప్రభుత్వం విఫలం
- ఇది భారత నాగరికత విలువలకు ద్రోహం చేసినట్లే- కాంగ్రెస్ విమర్శలు

ఢిల్లీ : ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ లు చేస్తున్న దాడుల విషయంలో మోదీ సర్కార్ అనుసరిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇరాన్ పై జరుగుతున్న వైమానిక దాడులను, ఆ దేశ అగ్రనేతల హత్యలను, అక్కడ బలవంతపు పాలనా మార్పు కోసం జరుగుతున్న ప్రయత్నాలను

## కేరళలో మరోసారి షిగెల్లా కలకలం

# 12మందికి పాజిటివ్

- పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన
- తాజాగా 12 మందికి వైరస్ సోకినట్టు వెల్లడి
- ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ అప్రమత్తం- నివారణ చర్యలు ముమ్మరం



ఢిల్లీ : కేరళలోని కోజికోడ్ జిల్లాలో షిగెల్లా వ్యాధి కలకలం రేపుతోంది. పెరువయల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎరంజికల్ ప్రాంతంలో తాజాగా మరో 12 మందికి షిగెల్లా సోకినట్లు నిర్ధరణ కావడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే కొద్ది రోజుల క్రితం నలుగురికి ఈ వ్యాధి నిర్ధరణ కాగా, వారిలో ఒక చిన్నారి మృతి చెందడం పరిస్థితిని మరింత తీవ్రమయ్యేలా చేసింది. తాజాగా నమోదైన కేసులతో మొత్తం బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం, కొత్తగా పాజిటివ్ వచ్చిన వారిలో చాలా మంది ఇప్పటికే బాధితులైన వారి కుటుంబ సభ్యులే. దీంతో వ్యాధి ఒకే ప్రాంతంలో వేగంగా వ్యాప్తి చెందుతున్నట్టు అధికారులు భావిస్తున్నారు. ఇదే నేపథ్యంలో ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ యంత్రాంగం అప్రమత్తమై విస్తృత స్థాయిలో నివారణ చర్యలు చేపట్టింది. మిగతా..2లో

## స్వేచ్ఛా నౌకాయానం, సముద్ర మార్గాల భద్రత ముఖ్యం'

## ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ

- ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్ తో ఫోన్ లో మాట్లాడిన ప్రధాని మోదీ
- ఈద్ , నౌరోజ్ శుభాకాంక్షలు తెలిపిన పీఎం



ఢిల్లీ : పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ తో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఇరాన్ అధ్యక్షుడికి ఈద్ , నౌరోజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా..2లో

## తిరుమల శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు కుటుంబం



- దేవాన్ష్ పుట్టినప్పటి నుంచీ ఏటా ఒకరోజు అన్నప్రసాద వితరణ
- సామాన్య భక్తునిలా వైకుంఠ క్యూ కాంప్లెక్స్ నుంచి వెళ్లి దర్శించుకున్న సీఎం
- మొదట్నుంటీ క్యూ కాంప్లెక్సులో వెళ్లి దర్శించుకుంటున్న చంద్రబాబు

అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్నారు. సీఎం హోదాలో నేరుగా మహాద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉన్నా సామాన్య భక్తునిలా వైకుంఠ క్యూ కాంప్లెక్స్ నుంచి దర్శించుకున్నారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రానికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

# జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తే నా భుజాలపై మోసుకుని తీసుకెళ్తా...

రంజాన్ ప్రార్థనల్లో బీఆర్ఎస్ నేతలతో జీవన్‌రెడ్డి...

అవినీతి అనే పదమే తెలియని వ్యక్తి జీవన్‌రెడ్డి...

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సంచలన వ్యాఖ్యలు...



జగిత్యాల//మార్చి 21(ఆకాంక్ష ) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తున్న వేళ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇప్పటికే జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే ప్రచారం కొనసాగుతుండగా త్వరలోనే ఆయన కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరతారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి రంజాన్ ప్రార్థనల్లో పాల్గొనడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. రంజాన్ ప్రార్థనల సందర్భంగా జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ



జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో పాటు పలువురు అనుచరులతో కలిసి కనిపించడం స్థానిక రాజకీయ వర్గాల్లో కొత్త ఊహాగానాలకు దారి తీసింది. కాంగ్రెస్‌లో అసంతృప్తితో ఉన్న నేతగా ఇప్పటికే చర్చలో ఉన్న జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్గాలకు దగ్గరవుతున్నారా మిగతా..2లో

## ఏపీ సర్కార్ కీలక నిర్ణయం.. డెయిరీ, పశుసంవర్ధక ఫారాలకు భారీ ఊరట



- పశుసంవర్ధక రంగానికి ఏపీ సర్కార్ భారీ ఊరట కల్పించింది.
- పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీల నుంచి మినహాయింపు నిచ్చింది.
- భవన అనుమతుల రుసుములో సడలింపులు చేసింది.

అమరావతి, మార్చి 21 : పశుసంవర్ధక రంగానికి ఏపీ సర్కార్ భారీ ఊరట కల్పించింది. పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీల నుంచి మినహాయింపు నిచ్చింది. మిగతా..2లో

తొలి ఆకాంక్ష



మొదటి పేజి తరువాయి

## జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తే నా భుజాలపై మోసుకుని తీసుకెళ్తా...

అనే ప్రశ్న మళ్లీ ముందుకు వచ్చింది. ముఖ్యంగా రంజాన్ ప్రార్థనల వేదికపై ఆయన హాజరు కావడం, బీఆర్ఎస్ నాయకులతో సన్నిహితంగా కనిపించడం రాజకీయంగా విశేష ప్రాధాన్యత పొందింది. ఈ నేపథ్యంలో జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలపై మీడియా ప్రతినిధులు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను ప్రశ్నించారు. దీనికి స్పందించిన సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ, జీవన్‌రెడ్డి తమ పార్టీలోకి రావాలనుకుంటే తానే స్వయంగా వెళ్లి తన భుజాలపై మోసుకుని తీసుకొస్తానని అన్నారు. జీవన్‌రెడ్డి వంటి మంచి మనిషి తమ పార్టీలోకి వస్తే ఎంతో ఆనందంగా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. జీవన్‌రెడ్డిపై తనకు ఎంతగానో గౌరవం ఉందని సంజయ్ పేర్కొన్నారు. తాను సర్జన్‌గా పనిచేసిన రోజుల్ని గుర్తుచేసుకుంటూ ఒక వ్యక్తిగత అనుభవాన్ని కూడా మీడియాతో పంచుకున్నారు. జీవన్‌రెడ్డి తమ్ముడికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన సమయంలో ఆయన ఆస్పత్రికి వచ్చేవారని, అప్పట్లో ఆయన ప్రవర్తన తనను బాగా ఆకట్టుకుందని తెలిపారు. తాను ఓపీడీకి వెళ్తుంటే ఇతరులందరికీ పక్కనే కుర్చీలు ఉండేవని, కానీ జీవన్‌రెడ్డి మాత్రం వినయంగా వెనుకవైపు కూర్చునేవారని చెప్పారు. ఈ రోజుల్లో చిన్న నాయకులే గన్‌మెన్లు కావాలంటూ హోదా ప్రదర్శనకు ప్రయత్నిస్తున్నారని, కానీ జీవన్‌రెడ్డి వంటి సీనియర్ నాయకుడు మాత్రం ఎలాంటి ఆర్భాటం లేకుండా ఎంతో సాధారణంగా, వినయంగా ఉండేవారని సంజయ్ వ్యాఖ్యానించారు. అందుకే ఆయనంటే తనకు ప్రత్యేక గౌరవమని చెప్పారు. జీవన్‌రెడ్డి దగ్గర అవినీతి అనే పదమే ఉండదని, ఆయన నిజాయితీ గల నాయకుడని కొనియాడారు. ఇలాంటి వ్యక్తి బీఆర్ఎస్‌లోకి వస్తే అది తమ పార్టీకి గౌరవకారణమవుతుందని సంజయ్ అన్నారు. జీవన్‌రెడ్డి రాజకీయ అనుభవం, ప్రజల్లో ఉన్న ఆదరణ, ఆయన వ్యక్తిత్వం పార్టీకి మరింత బలం చేకూరుస్తాయని అభిప్రాయ పడ్డారు. తమకు జీవన్‌రెడ్డి సాబ్ అంటే అపారమైన గౌరవమని, ఆయన రావాలనుకుంటే మర్యాద పూర్వకంగా ఆనందంగా ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు. జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరతారా లేదా అన్న విషయంపై ఇప్పటివరకు ఆయన స్వయంగా ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయనప్పటికీ, తాజా పరిణామాలు మాత్రం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. కాంగ్రెస్‌లో ఆయన అసంతృప్తి, బీఆర్ఎస్ నేతలతో సన్నిహితంగా కనిపించడం, ఇక ఎమ్మెల్యే సంజయ్ లాంటి నాయకుల బహిరంగ ఆహ్వానం అల్ ఇవన్నీ కలిపి చూస్తే ఆయన రాజకీయంగా కీలక నిర్ణయం తీసుకునే దశకు చేరుకున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే రోజుల్లో జీవన్‌రెడ్డి వైఖరి ఏ దిశగా మలుపు తిరుగుతుందన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా జగిత్యాల జిల్లా రాజకీయాల్లో ఆయన నిర్ణయం ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతగా గుర్తింపు పొందిన జీవన్‌రెడ్డి రాజకీయ అడుగు ఎటు పడుతుందో అన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

## ఏపీ పారిశ్రామిక రంగంలో మరో ముందడుగు

ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటి. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నక్కపల్లి, పాయకరావుపేట, చుట్టుపక్కల ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఉక్కు కర్మాగారం వస్తే దానిపై ఆధారపడే వందలాది చిన్న తరహా పరిశ్రమలు చుట్టుపక్కల ఏర్పడతాయి. తద్వారా పరోక్ష ఉపాధి భారీగా పెరుగుతుంది. ఆర్సెలార్ మిట్టల్ – నిప్పాన్ స్టీల్ సంస్థలు ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సంస్థలు అత్యంత ఆధునికమైన, పర్యావరణహితమైన సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నాయి.

### 23న భూమిపూజ..

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో కలిసి ఈనెల 23వ తేదీన (సోమవారం) భూమిపూజ చేయనున్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

### పారిశ్రామిక రంగంలో కొత్త అధ్యాయం..

గత 21 నెలలుగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన పారిశ్రామిక విధానాలు, సులభతర వాణిజ్యం వేగవంతమైన అనుమతుల వల్లే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విశాఖపట్నం పోర్టుకు సమీపంలో ఉండటంతో ముడిసరుకు రవాణా , ఎగుమతులకు ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ప్రాజెక్టు కేవలం ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్‌ను 'భారతదేశ ఉక్కు రాజధాని'గా మార్చే దిశగా వేసిన బలమైన అడుగని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## తెలుగు రాష్ట్రాల్లో కొండెక్కిన కోడి ధర.. మధ్య తరగతి గుండెల్లో రైళ్లు!

కోడి మాంసం ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. కేవలం ఒక్క రోజులోనే భారీగా ధరలు పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా ఏపీలో నిన్నటి కంటే ఈరోజు ఏకంగా రూ. 70 అదనంగా పెరగడం గమనార్హం. విజయవాడలో స్కిన్ లెస్ చికెన్ కిలో ధర రూ. 380 నుండి రూ. 400 వరకు పలుకుతోంది. హైదరాబాద్ లో కిలో చికెన్ రూ. 340 నుండి రూ. 350 మధ్య విక్రయిస్తున్నారు. అసలు దీని ధర అడిగితేనే గుండె జారిపోయేలా ఉంది. కిలో నాటుకోడి ఏకంగా రూ. 800 పలుకుతోంది. అంటే దాదాపు మటన్ ధరతో పోటీ పడుతోంది. వ్యాపారులు మరియు పౌల్ట్రీ రైతుల విశ్లేషణ ప్రకారం ఈ పెరుగుదల వెనుక ఐదు కీలక కారణాలు ఉన్నాయి. తీవ్రమైన ఎండల వల్ల కోళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. దీంతో మార్కెట్‌లోకి రావాల్సిన సప్లై గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రంజాన్ పండుగ కావడంతో చికెన్ వినియోగం విపరీతంగా పెరిగింది. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో డిమాండ్ రెట్టింపయింది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగాయి. అలాగే కోళ్లకు వేసే దానా ధరలు కూడా పెరగడంతో పౌల్ట్రీ రైతులు రేట్లు పెంచక తప్పడం లేదు.

## ఏపీ సర్కార్ కీలక నిర్ణయం.. డెయిరీ, పశుసంవర్థక ఫారాలకు భారీ ఊరట

భవన అనుమతుల రుసుములో సర్కార్ సడలింపులు చేసింది. ఈ సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు(శనివారం) మాట్లాడారు. రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేస్తూ పశుపోషకులు, చిన్నరైతులకు పెద్దఎత్తున ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏపీలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థలు పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు/మేకల పెంపకం కేంద్రాలు, పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక ఫారాలకు బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ చార్జీలు మినహాయింపు ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ ఫారాలకు భవన అనుమతి/లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులు, చిన్న వ్యవసాయదారులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. దీంతో మరింత మందికి స్వయం ఉపాధి, సంవృద్ధి లభిస్తుందని వెల్లడించారు. గత జూన్‌లో జరిగిన సీఎం కాంక్లేవ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటీ కూడా ఇప్పటివరకు అమలు కాలేదు

ఆ పార్టీ కూడా బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలపై ఒత్తిడి తేవాలి : మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నారని, వెంటనే అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పింఛను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామన్నారని, వెంటనే పెంచాలని అన్నారు. విద్యార్థులకు విద్యా భరోసా కార్డులు ఇస్తామన్నారని, వెంటనే ఇవ్వాలని, కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామన్నారని, అదీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాము పెట్టే బిల్లు పాస్ అయితే హామీలన్నీ చట్ట ప్రకారంగా అమలవుతాయని స్పష్టం చేశారు. తాము పెట్టే బిల్లుకు మద్దతు ఇవ్వాలని ప్రజలు వారి ఎమ్మెల్యేలపై ఒత్తిడి తేవాలని కోరారు. "వచ్చే శుక్రవారం నాడు శాసనసభలో మేము ప్రైవేటు బిల్లు పెట్టాలని నిర్ణయించాం. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ ప్రైవేటు మెంబర్ ప్రవేశపెట్టనున్నాం. మేము సభలో బిల్లు ప్రవేశపెట్టేలా అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నాం. కాంగ్రెస్ హామీ ఇచ్చిన అంశమే కాబట్టి ఆ పార్టీ కూడా బిల్లుకు మద్దతు ఇవ్వాలి. ఆరు గ్యారంటీలపై సీఎం సంతకం చేసిన దస్త్రం కనిపించకుండా పోయింది రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం రోజున 6 గ్యారంటీల దస్త్రంపై సంతకం చేశారు. అభయహస్తం అనే దస్త్రంపై సీఎం రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేశారు. గవర్నర్ ప్రసంగంలోనూ ఆరు గ్యారంటీలపై సంతకం జరిగిందని చెప్పించారు. ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటీ కూడా ఇప్పటివరకు అమలు కాలేదు"

## కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్

గత శనివారం నిర్వహించిన 'అంజన్న ఆశీర్వాద యాత్ర' ముగింపు సమయానికి ఆలయం మూసివేయడంతో, అప్పట్లో ఆయన ముఖద్వారం వద్దే మొక్కు తీర్చుకున్నారు. ఆ వెలితిని పూడ్చుకుంటూ నేడు మళ్ళీ ఆలయానికి విచ్చేశారు. అర్చకులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. గర్భాలయంలో పూజల అనంతరం బండి సంజయ్‌ను శాలువాతో సన్మానించి ఆశీర్వచనాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ సునీల్ రావు, బీజేపీ నేతలు ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

# తిరుమల శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు కుటుంబం

మొదటి పేజి తరువాయి



ఆ తర్వాత సీఎం కూడా శ్రీవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మనవడు దేవాంశ్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి సీఎం శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న సీఎంకు ఆలయ ఈవో, అర్చకులు మహాద్వారం వద్ద ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, మనుమడు దేవాంశ్ తో కలిసి ఆలయం లోనికి వెళ్లిన సీఎం శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులకు పండితుల వేదాశీర్వచనాలు చేశారు. అనంతరం అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవుని ముందు అందరూ సమానమే: శ్రీవారి పాదాల చెంత పుట్టానని, ఆయన కటాక్షం వల్లే తనకు పునర్జన్మ లభించిందని బహిరంగంగా ప్రకటిస్తూ తన ఇలవేల్పుపై భక్తిభావాలను చాటుకునే సీఎం చంద్రబాబు, భక్తిని మాటల్లోనే కాదు, ఆచరణలోనూ చూపుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నవారికి తిరుమలలో ప్రోటోకాల్ ప్రకారం మహాద్వారం నుంచి నేరుగా ఆలయ ప్రవేశానికి అవకాశం ఉంది. కానీ దేవుని ముందు అందరూ సమానమేనన్న భావనతో చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో తిరుమలకు వచ్చినా క్యూ కాంప్లెక్స్ ద్వారా వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించే సమయంలో మినహా తిరుమల వచ్చిన ప్రతిసారీ కుటుంబసమేతంగా క్యూలైన్ ద్వారానే వెళ్లి స్వామివారిని దర్శించుకుంటున్నారు. తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ ఇదే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన: క్యూ కాంప్లెక్స్ నుంచి దర్శనానికి వెళ్లడం ద్వారా శ్రీవారిపై తనకున్న భక్తిభావాన్ని చాటడంతో పాటు సామాన్య భక్తులకు టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలనూ గమనిస్తూ సీఎంగా తన బాధ్యతలను చంద్రబాబు నెరవేరుస్తున్నారు. క్యూ కాంప్లెక్స్‌లో ప్రసాదం పంపిణీ, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం వంటి అంశాలు ఎలా ఉన్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ లోపాలు కనిపిస్తే వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచనలు చేస్తారు. తిరుమల కొండపై భక్తుల ఆకలి తీర్చే అన్నదాన కార్యక్రమానికి ఏటా విరాళం అందజేస్తూ చంద్రబాబు కుటుంబం దాతృత్వం చాటుకుంటోంది. 1985లో ఎన్టీఆర్ హయాంలో 2 వేల మందితో ప్రారంభమైన అన్నదానం 1994లో ఎస్వీ నిత్య అన్నదాన ట్రస్టుగా రూపాంతరం చెంది, తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్ ద్వారా, నిత్యం వేలాది మంది భక్తుల కడుపు నింపుతోంది. ఈ ప్రతిష్టాత్మక ట్రస్టుకు సీఎం చంద్రబాబు తన మనవడు దేవాన్ష్ పుట్టినప్పటి నుంచీ ఒక ఏడాది మినహా 11 సార్లు ఒక రోజు అన్నదాన వ్యయాన్ని విరాళంగా అందజేస్తున్నారు. 11 సార్లు: 2015, 2016 సంవత్సరాల్లో రూ. 20 లక్షలు, 2017లో రూ. 25 లక్షలు, 2018లో రూ.26 లక్షలు, 2019 నుంచి 2021 వరకు రూ. 30 లక్షలు, 2023లో రూ.33 లక్షలు, 2024లో రూ.38 లక్షలు, 2025, 2026 సంవత్సరాల్లో రూ. 44 లక్షల రూపాయల చొప్పున దేవాంశ్ పేరుతో అన్నదానం కోసం విరాళం అందజేశారు. ఇలా మొత్తం 11 సార్లు 3 కోట్ల 40 లక్షల రూపాయలు విరాళంగా అందజేసి స్వామివారిపై తమ కుటుంబానికి ఉన్న అపారమైన భక్తిని చాటుకున్నారు. మనవడు దేవాంశ్ పుట్టినరోజు సందర్భంగా ఈ ఉదయం తిరుమల శ్రీవారిని సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా దర్శించుకోనున్నారు. దర్శనానంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రానికి చేరుకొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు. అనంతరం తిరుమలలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ని సందర్శించనున్నారు.

ప్రతీ ఏటా విరాళం:

ఎన్టీఆర్ హయాంలో తిరుమలలో ఏర్పాటు చేసిన అన్నదానం ట్రస్టు తిరుమల కొండకు వచ్చే భక్తులకు అన్నప్రసాదంతో ఆకలి తీరుస్తూనే ఉంది. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్సులో నిత్యం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతూనే ఉంటుంది. ఈ ట్రస్టుకు తన మనవడు దేవాంశ్ పుట్టినప్పటి నుంచీ ప్రతి ఏడాదీ విరాళాన్ని సీఎం చంద్రబాబు అందిస్తున్నారు. దేవాంశ్ పేరుతో అన్నదానం కోసం 12 సార్లు విరాళం అందించారు.

# 'స్వేచ్ఛా నౌకాయానం, సముద్ర మార్గాల భద్రత ముఖ్యం'

మొదటి పేజి తరువాయి



ఈ పండుగ సీజన్ పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛను కాపాడడం, సముద్ర రవాణా మార్గాలను సురక్షితంగా ఉంచడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. అంతేకాదు ఇరాన్ లో ఉన్న భారత పౌరుల భద్రతకు సంబంధించి అక్కడి ప్రభుత్వం అందిస్తున్న నిరంతర సహకారానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. "ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెస్కియాన్ తో మాట్లాడి ఈద్ , నౌరోజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగలు పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పుతాయని ఆశిస్తున్నాను. ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీసే మౌలిక సదుపాయాలపై దాడులను ఖండించాను."

– ప్రధాని మోదీ, ఎక్స్ పోస్టు

దౌత్య సంబంధాలు పై అమెరికా, ఇజ్రాయెల్ లు దాడులు చేయడంతో పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇరాన్ అధ్యక్షుడితో మోదీ మాట్లాడడం ఇదే రెండోసారి. అంతకు ముందు మార్చి 12న ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. అప్పుడు ఇరాన్ అధ్యక్షుడు యుద్ధ పరిస్థితుల గురించి వివరించారు. అయితే భారత్ మొదటి నుంచి అన్ని సమస్యలను చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలని, ఇదే తమ స్థిరమైన విధానమని స్పష్టం చేస్తూ వస్తోంది. వాస్తవానికి పశ్చిమాసియా సంక్షోభం మొదలైనప్పటి నుంచి ప్రధాని మోదీ – సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ , బహ్రెయిన్, కువైట్, జోర్డాన్ , ఫ్రాన్స్ , మలేషియా తదితర దేశాల నాయకులతో సంప్రదింపులు జరిపారు.

వార్ ఎఫెక్ట్

గత మూడు వారాలుగా ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ ల మధ్య దాడులు, ప్రతిదాడులు నిరంతరాయంగా కొనసాగుతూ ఉన్నాయి. ముఖ్యంగా ఇరాన్ ప్రతీకార దాడులకు దిగి ఇజ్రాయెల్ తో సహా, తన పొరుగు దేశాల్లో ఉన్న అమెరికన్ మిలటరీ బేస్ లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తోంది. అంతేకాదు ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతం మేర జరిగే హర్మూజ్ జలసంధిని తన నియంత్రణలోకి తీసుకుంది. దీనితో ప్రపంచవ్యాప్తంగా చమురు సహా మిగతా ఇంధన సమస్యలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ కొన్ని ఎంచుకున్న చమురు నౌకలను మాత్రమే హర్మూజ్ గుండా వెళ్లేందుకు అనుమతి ఇస్తోంది.

### ఇరాన్ ప్రస్తుత పరిస్థితి ఏమిటి?

అలీ ఖమేనీ మృతి తర్వాత, ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్ గా ఎన్నికయ్యారు. ఆయన కూడా యుద్ధ రంగంలో తగ్గేది లేదంటున్నారు. అందుకే అమెరికా, ఇజ్రాయెల్ పై ప్రతీకార దాడులు కొనసాగిస్తున్నారు. దీనితో యుద్ధం మరింత తీవ్రమవుతోంది. మరోవైపు ఇరాన్ లోని అత్యంత కీలకమైన నతాంజ్ యురేనియం శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ లో సంయుక్తంగా వైమానిక దాడులు జరిపాయి. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ తస్నిమ్ ధ్రువీకరించింది. అయితే ఈ దాడి తర్వాత ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువడలేదని పేర్కొంది. కనుక అణుకేంద్రం సమీపంలో నివసించే ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని అధికారులు తెలిపారు. ఇంతకు ముందు అంటే గురువారం ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ ద్రవీకరణ కేంద్రమైన ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ పారిశ్రామిక నగరంపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. దీనితో తమ దేశ ఎల్ఎన్‌జీ ఎగుమతి సామర్థ్యం 17 శాతం మేర పడిపోయిందని, తమకు భారీ నష్టం వాటిల్లిందని ఖతార్ రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది.

# కేరళలో మరోసారి షిగెల్లా కలకలం- 12మందికి పాజిటివ్

మొదటి పేజి తరువాయి

ఎరంజికల్, పూవట్టుపరంబ ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు మెడికల్ టీంలు ఇంటింటికీ వెళ్లి పరిశీలనలు నిర్వహిస్తున్నాయి. లక్షణాలు కనిపిస్తున్న వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మరికొంతమంది అనుమానితులను ఆసుపత్రుల్లో చేర్చి, వారి నమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో ఇంటింటికీ బావుల క్లోరినేషన్ కార్యక్రమం చేపట్టారు. తాగునీటి వనరులను శుభ్రపరిచే పనులు వేగవంతం చేశారు. అదనంగా, ఆహార భద్రతా శాఖ అధికారులు రంగంలోకి దిగారు. పరిశుభ్రత లేని పరిస్థితుల్లో పనిచేస్తున్న మూడు ఆహార దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన ఆహారం, తాగునీరు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితిపై పెరువయల్ గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఆర్‌వీ జాఫర్ స్పందిస్తూ, షిగెల్లా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసర సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈద్ రోజున కూడా ఆరోగ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి సమావేశమై చర్యలను సమీక్షించినట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో కూడా క్లోరినేషన్ పూర్తి చేసినట్టు వెల్లడించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై వివరాలు అందిస్తున్నారు. జ్వరము, విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వ్యాధి వ్యాప్తికి అసలు కారణాలను తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యంగా తాగునీటి వనరుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పిల్లలు కూడా బాధితుల్లో ఉండటంతో ఆరోగ్య శాఖ మరింత జాగ్రత్తలు తీసుకుంటోంది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసి, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులను వెంటనే ఆసుపత్రులకు తరలించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం చేపట్టిన చర్యలతో వ్యాధి వ్యాప్తిని త్వరలోనే



అదుపులోకి తీసుకురాగలమనే ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, పరిశుభ్రత పాటిస్తే షిగెల్లా వ్యాధిని సమర్థంగా నివారించవచ్చని ఆరోగ్య శాఖ సూచిస్తోంది. గెల్లా అంటే ఏంటి అసలు? షిగెల్లా అనేది బాక్టీరియా (సూక్ష్మక్రిములు) వల్ల కలిగే ఒక రకమైన అంటువ్యాధి, దీనిని షిగెల్లోసిస్ అని కూడా పిలుస్తారు. ఇది ప్రధానంగా జీర్ణవ్యవస్థను, ముఖ్యంగా ప్రేగులను ప్రభావితం చేస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ గురించి కొన్ని ముఖ్యమైన విషయాలు:

# ఇరాన్ పై దాడులను ఖండించడంలో మోదీ సర్కార్ విఫలం- ఇది పిరికితనానికి, ద్రోహానికి నిదర్శనం

మొదటి పేజి తరువాయి



అడ్డుకోవడంలో మోదీ సర్కార్ పూర్తిగా విఫలమైందని విమర్శించింది. దాడులను ఖండించకపోవడం నైతిక పిరికితనానికి చిహ్నమని, భారత నాగరికత విలువలకు ద్రోహం చేయడమేనని పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం ఎక్స్ వేదికగా మోదీ సర్కార్ పై విరుచుకుపడ్డారు. "ప్రధాని మోదీ తనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులతో గొప్ప స్నేహం ఉందని చెప్పుకుంటారు. మరి ఆ గొప్ప స్నేహాన్ని ఉపయోగించి, యుద్ధాన్ని ఆపడానికి మోదీ ఎందుకు చొరవ తీసుకోవడం లేదు" అని ప్రశ్నించారు. "ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు ప్రారంభమై సరిగ్గా 21 రోజులు లేదా మూడు వారాలు అవుతోంది. ప్రధాని మోదీ తన ఆర్భాటపు ఇజ్రాయెల్ పర్యటన ముగించుకుని, తిరిగి భారత్ కు వచ్చి కూడ 23 రోజులైంది. కానీ, ప్రస్తుతం భారత్ లో సహా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అస్థిరతకు దారితీసిన అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులను మోదీ సర్కార్ ఖండించిందా? కనీసం విమర్శించిందా? అంటే, దానికి సమాధానం లేదు (నో). పోనీ అమెరికా-ఇజ్రాయెల్ లో ఇరాన్ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకొని హత్యలు చేస్తోంది. కనీసం మోదీ ప్రభుత్వం ఆ హత్యలను ఖండించిందా? అంటే, దానికి కూడా సమాధానం లేదు (నో). ఇరాన్ లో అంతర్యుద్ధం వచ్చేలా, అక్కడి ప్రభుత్వాన్ని కూల్చేసి దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న క్రూరమైన ప్రయత్నాలను మోదీ సర్కార్ విమర్శించిందా? అంటే, దానికి సమాధానం లేదు (నో). పోనీ ఇరాన్ పై చేస్తున్న బాంబు దాడులను, అలాగే గల్ఫ్ దేశాల్లోని ఇంధన, ఇతర మౌలిక సదుపాయాలపై ఇరాన్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలని చెబుతూ, మోదీ ప్రభుత్వం ఏమైనా దౌత్యప్రయత్నాలు చేసిందా? ఏమైనా చొరవ తీసుకుందా? కాల్పుల విరమణ కోసం ప్రధాని మోదీ తన స్నేహాన్ని ఉపయోగించారా? అంటే, దానికి సమాధానం లేదు (నో). ఈ నాలుగు 'నో'లు మోదీ ప్రభుత్వ నైతిక పిరికితనాన్ని, భారత నాగరికత విలువల పట్ల చేస్తున్న రాజకీయ ద్రోహాన్ని ప్రతిబింబిస్తున్నాయి."

**– జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యునికేషన్స్ ) ఎక్స్ పోస్ట్**

మరింత తీవ్రమవుతున్న యుద్ధం

గత మూడు వారాలుగా కొనసాగుతున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గే సూచనలు కనిపించడం లేదు. శనివారం తెల్లవారు జామున కూడా ఇరాన్ తమపై క్షిపణులు ప్రయోగించిందని ఇజ్రాయెల్ పేర్కొంది. మరోవైపు, తమ ప్రధాన చమురు కేంద్రాలు ఉన్న తూర్పు ప్రాంతంలో కేవలం 2 గంటల వ్యవధిలో 20 డ్రోన్ లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా వెల్లడించింది. మరోవైపు ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలపై దాడులు చేస్తున్న ఇరాన్ , ఇకపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలపై కూడా దాడులు చేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో, అమెరికా మరిన్ని యుద్ధ నౌకలను, మరో 2500 మెరైన్స్ ను పశ్చిమాసియాలో మోహరిస్తోంది. కాగా, ఇప్పటి వరకు జరిగిన యుద్ధం వల్ల ఇరాన్ లో 1300 మందికి పైగా, లెబనాన్ లో 1000 మందికి పైగా, ఇజ్రాయెల్ లో 15 మంది, అమెరికాకు చెందిన 13 మంది సైనికులు మరణించారు. లెబనాన్ , ఇరాన్ ల్లో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ

మొదటి పేజి తరువాయి

మీది ఎందుకని ప్రశ్నించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రావడానికికంటే ముందు జిల్లాకు రద్దు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1,070 కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సగం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని, మూడుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 27 నెలల తర్వాత సిద్దిపేటకు వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేట నియోజకవర్గం లేదన్నట్లుగా ఇన్నాళ్లు వ్యవహరించారని విమర్శించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం పేరిట సిద్దిపేటలో అడుగుపెడుతున్న ముఖ్యమంత్రికి తాను పలు ప్రశ్నలు సంధించదలుచుకున్నానని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిఫలమే ఈ పామాయిల్ ఫ్యాక్టరీ అని పేర్కొన్నారు. కానీ అదే కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ వాళ్లు కూలేశ్వరంగా అభివర్ణించారని మండిపడ్డారు. ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన కృషి ఫలితమే అన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు, పామాయిల్ తోటల సాగులో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. 2021 జూన్ 5న తొలి పామాయిల్ మొక్కను నాటింది తానేనని వెల్లడించారు. 2022 జనవరి 12వ తేదీన 62 ఎకరాల భూమి కేటాయించి, మార్చి 4న భూమికి ఫెన్సింగ్ పనులు మరియు స్టోరేజ్ వాటర్ రిజర్వాయర్‌ను ప్రారంభించామని తెలిపారు 2023 ఏప్రిల్ 4న ఫ్యాక్టరీకి పునాదిరాయి వేసి పనులు ప్రారంభించామని అన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాత్ర కొండంత అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం పాత్ర గోరంత కూడా లేదని అన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.1,070 కోట్ల నిధులను అర్ధాంతరంగా రద్దు చేశారని ఆరోపించారు. నిధులను రద్దు చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేపు అధికారిక పర్యటన చేస్తున్నందున, ఆ నిధులన్నీ తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో 22 వేల మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. రూ.170 కోట్ల మేర రైతు భరోసా నిధులు రాలేదని, వాటిని రేపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరై, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రద్దయి ఆగిపోయిన పనుల జాబితాను ఆయన పేర్కొన్నారు. రంగనాయకసాగర్ టూరిజం, కోమటిచెరువు శిల్పారామం, సిద్దిపేట నియోజకవర్గ ఔటర్ రింగు రోడ్డు, తోర్నాలలో బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల, మిట్టపల్లిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భవనం, సిద్దిపేటలో క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ హబ్, టు టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, సిద్దిపేట–ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రోడ్డు, సిద్దిపేట–కిష్టాపూర్ రహదారి, సిద్దిపేటలో మల్టీపర్పస్ ఆడిటోరియం, సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ ఆగిపోయాయని అన్నారు.

# సంపాదకీయం

## ఉన్నత విద్యా ప్రమాణాలు సమున్నతమయ్యేనా?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరి 27న జారీ చేసిన జీవో రాష్ట్ర ఉన్నత విద్యా వ్యవస్థలో చర్చకు తెర తీస్తున్నది. ఇప్పటివరకు విడివిడిగా పనిచేస్తున్న కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వ్యవస్థలను ఏకీకృతం చేసి కమిషనరేట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనే ఒకే నోడల్ సంస్థ ఏర్పాటు ఈ ఉత్తర్వుల లక్ష్యం. ఈ నిర్ణయాన్ని కేవలం పరిపాలనా మార్పుగా కాకుండా, రెండు దశాబ్దాలుగా ఉన్నత విద్య ఎదుర్కొంటున్న సమస్యలు, అలాగే ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్వయంగా చెప్పుకున్న కారణాల నేపథ్యంలో చూడాలి. ఈ ఉత్తర్వుల్లో ప్రభుత్వం మొదటగా ప్రస్తావించింది విజన్ 'స్వర్ణాంధ్ర ఏ2047'. ఈ డాక్యుమెంట్ ప్రకారం రాష్ట్రాన్ని దీర్ఘకాలంలో జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే మానవ వనరుల నాణ్యతను వేగంగా మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ప్రభుత్వం చెప్పిన మరో కారణం ఉన్నత విద్య పరిపాలన చిన్న చిన్న విభాగాలుగా ఉండటం, విభిన్న సంస్థల మధ్య అధికారాల అతివ్యాప్తి, ఇందువల్ల ఏర్పడిన బాధ్యతాయుత నాయకత్వ లోపం. ఈ పరిస్థితి వల్ల నిర్ణయాలు ఆలస్యమై, విద్యా సంవత్సరం గందరగోళానికి లోనవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని అంగీకరించింది. ఇంకొక అంశం ఇప్పటివరకు డిగ్రీ కాలేజీలు ఒక కమిషనరేట్ ఆధీనంలో, ప్రైవేట్ కాలేజీలు మరో నియంత్రణలో, టెక్నికల్ ఎడ్యుకేషన్ మరో విభాగం ఆధీనంలో ఉండటం వల్ల ఒకే విధమైన అకడమిక్ ప్రమాణాల అమలు సాధ్యం కావడం లేదు. అలాగే, టెక్నికల్ ఎడ్యుకేషన్ విషయంలో ఫైళ్ళు రెండు మూడు విభాగాల మధ్య తిరగడం వల్ల నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్లు, ఫీజు నిర్ధారణ, అనుబంధ ప్రక్రియలు ఆలస్యం కావడం. ఇవన్నీ కలిపి చూస్తే, ఈ ఉత్తర్వులు యాదృచ్ఛికంగా కాకుండా, ఉన్నత విద్య పాలనలోని వాస్తవ లోపాలకు ప్రతిస్పందనగా తెచ్చినవి. విశ్వవిద్యాలయాలు నిజంగా జ్ఞానసృష్టి కేంద్రాలుగా మారాలంటే వాటికి అకడమిక్, పరిపాలన, ఆర్థిక అంశాల్లో స్వయంప్రతిపత్తి అవసరం అని జాతీయ విద్యా విధానం2020 (ఎన్ఈపీ) చెబుతోంది. విశ్వవిద్యాలయాల విషయంలో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండకూడదు. పాలకమండలిలో కూడా విద్యా ప్రమాణాలు సాధించడంలో ప్రత్యేక అనుభవం ఉన్న అధ్యాపకులను, విద్యారంగ నిపుణులను, మేధావులను నియమించాలి. నియంత్రణ అవసరమే కానీ హద్దుల్లో ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయి విద్య, పరిశోధన, కొత్త ఆలోచనలు ఇవన్నీ స్వేచ్ఛాయుత విద్యా వాతావరణం లేకుండా ఎదగలేవు. ఈ కారణంగానే విశ్వవిద్యాలయాలను కేవలం బోధనా సంస్థలుగా కాకుండా, స్వతంత్ర ఆలోచనా కేంద్రాలుగా పెద్దలు భావించారు. అందువల్లనే, విశ్వవిద్యాలయాలకు స్వయంప్రతిపత్తిని కల్పించారు. అక్కడక్కడా చెదురుమదురుగా జరుగుతున్న కొన్ని అసందర్భమైన విషయాలను చూసి మొత్తం విశ్వవిద్యాలయాలన్నింటినీ ఒకే గాటన కట్టకూడదు. ఈ ఉత్తర్వుల్లో విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి పూర్తిగా రద్దు అవుతుందని ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదు. కానీ పరిపాలనా ఏకీకరణ, ఒకే నోడల్ వ్యవస్థ, ఫైల్ రూటింగ్ పెరగడం వంటి పరిణామాలు ఆచరణలో స్వయంప్రతిపత్తిని పూర్తిగా కాగితాలకే పరిమితం చేసే ప్రమాదముంది. ఇలా జరిగితే, పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో కొత్త కోర్సుల రూపకల్పన, అంతరశాఖా కార్యక్రమాలు ప్రారంభించడం, పరిశోధనా ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం వంటి అంశాలు నెమ్మదించే ప్రమాదం కూడా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్నత విద్య ప్రమాణాలపై ఆందోళనలు ఉన్నాయి. దీనిని కాగ్ నివేదికలు, పార్లమెంటరీ కమిటీ వ్యాఖ్యలు, నాణ్యతా భరోసా సంస్థల మార్గదర్శకాలు కూడా సూచిస్తున్నాయి. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే చిన్నచిన్న లోపాలు దొర్లినందుకు మొత్తం వ్యవస్థను బలహీనపరచడం సరైన మార్గమా? విధానపరంగా ఇది సమానుపాతం అనే సూత్రానికి విరుద్ధం. ఇప్పటి సంస్కరణల చర్చలో మరో కీలకమైన అంశం మానవీయ శాస్త్రాలు, భాషా సాహిత్యాల స్థానం. ఎన్ఈపీ స్వయంగా చెబుతున్న విషయం భారతీయ భాషలు, సాహిత్యం, తత్వశాస్త్రం, కళలు ఒక జాతి సాంస్కృతిక మేధస్సుకు మూలాధారం. కేవలం సాంకేతికత, ఉద్యోగావకాశాలనే ప్రధానంగా చూసి మానవీయ శాస్త్రాలను నిర్లక్ష్యం చేస్తే, సంస్కృతీ వైముఖ్యం, నైతిక పతనం, సామాజిక విభేదాలు దీర్ఘకాలంలో పెరుగుతాయి. అందుకే విశ్వవిద్యాలయాలలో ముఖ్యంగా డిగ్రీ స్థాయిలో, భాషా, సాహిత్యాల కోర్సులను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అనువాద అధ్యయనాలు, సాంస్కృతిక పరిశ్రమలు, మీడియా, వారసత్వ అధ్యయనాలు వంటి అంతరశాఖా రూపాల్లో పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇది విద్యార్థుల నమోదు పెరగడానికి సహాయపడుతుంది. ఉత్తర్వులలో మంచి ఉద్దేశాలు ఉన్నాయి. పరిపాలనా గందరగోళాన్ని తగ్గించడం, సమన్వయం పెంచడం, డేటా ఆధారిత పాలనకు దారి చూపడం వంటివి. అదే సమయంలో ప్రమాదాలూ ఉన్నాయి. విశ్వవిద్యాలయాలు కేవలం అమలు కేంద్రాలుగా మారే అవకాశం, స్నాతకోత్తర స్థాయి కోర్సులు, పరిశోధనలు పరోక్షంగా దెబ్బతినే ప్రమాదం, మానవీయ శాస్త్రాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం వంటివి. కాబట్టి, ఈ సందర్భంలో ఈ ఉత్తర్వుల అవసరం ఉన్నది కానీ పైన చెప్పిన విషయాలన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సమతుల్యమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. జిఒజు తన పాత్రను సమన్వయకర్తగా పరిమితం చేయాలి, నెమ్మదిగా విద్యాత్మక నియంతృత్వానికి దారి తీయకూడదు. విశ్వవిద్యాలయాల కోసం స్పష్టమైన "స్వయం ప్రతిపత్తి చార్టర్" ప్రకటించాలి. స్నాతకోత్తర స్థాయి కోర్సులు, పరిశోధనలపై కనీస జోక్యం, గరిష్ఠ రక్షణ విధానం ఉండాలి. మానవీయ శాస్త్రాలు, భాషా సాహిత్యాలకు ప్రత్యేక ప్రోత్సాహక విధానాలు రూపొందించాలి. అక్రమాలకు లక్షిత పరిష్కారాలు ఇవ్వాలి.

# వంటగ్యాస్ కష్టాలు ఇంకెన్నాళ్లు?



అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధం వల్ల వంట గ్యాస్‌కు కొరత నెలకొంది. ధరలు సైతం పెరిగాయి. కొన్ని చోట్ల ఖాళీ సిలిండర్లతో ప్రజలు బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇదే అదనుగా బ్లాక్ మార్కెట్ దందాలు, అక్రమ నిల్వలు పెరుగుతున్నాయి. వంట గ్యాస్ కోసం విదేశాల మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఇండియా ప్రత్యామ్నాయాలను అన్వేషించాల్సి ఉంది. ఇంధన సరఫరాలకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాకు ఆటంకం ఏర్పడటం, గల్ఫ్‌లోని ప్రధాన గ్యాస్, చమురు కేంద్రాలపై ఇరాన్ విరుచుకుపడుతుండటంతో ప్రస్తుతం గ్యాస్‌కు కొరత తలెత్తింది. ఇరాన్ దాడుల కారణంగా ఖతార్ వంటివి ఇంధన ఉత్పత్తిని నిలిపేశాయి. ఇండియాలో డెబ్భై శాతానికి పైగా కుటుంబాలు వంట కోసం ప్రాథమికంగా లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్‌పీజీ)పై ఆధారపడుతున్నాయి. 2021-22 నాటి గణాంకాల ప్రకారం నగర ప్రాంతాల్లో 89శాతం కుటుంబాలకు వంటకు ఎల్‌పీజీయే దిక్కు. గ్యాస్ కొరత వల్ల బ్లాక్ మార్కెట్లో సిలిండర్ ధరలు పేలిపోతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. మారిన అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో రష్యా, ఇరాన్‌ల నుంచి భవిష్యత్తులో ఇంధనాన్ని ఇండియా కొనుగోలు చేసే అవకాశం లేదు. యుద్ధ ప్రభావిత గల్ఫ్ దేశాలు పూర్తిస్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించడానికి మరికొంత సమయం పడుతుంది. కాబట్టి, రాబోయే రోజుల్లోనూ గల్ఫ్ చమురు, గ్యాస్‌లకు లోటు తప్పకపోవచ్చు. ఈ నేపథ్యంలో అసలు విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఇండియా తన పంథా మార్చుకుని, గ్యాస్ స్వావలంబన కోసం కొత్త విధానాన్ని రూపొందించుకోవాలి. స్థానికంగా ఉత్పత్తిని పెంచుకోవడంపై దృష్టి సారించాలి. ఈ క్రమంలో తొలుత బయోగ్యాస్ ఉత్పత్తిని, దాని నిల్వలను పెంచుకోవాలి.

### అన్నిచోట్లా బయోగ్యాస్ ప్లాంట్లు

ఇండియా ప్రస్తుతం 207 కోట్ల క్యూబిక్ మీటర్ల బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తోంది. దృష్టి పెడితే ఏటా 2,900-4,800 కోట్ల క్యూబిక్ మీటర్ల దాకా ఈ గ్యాస్‌ను ఉత్పత్తిచేసే అవకాశముంది. అలాగే, ప్రతి జిల్లాలో బయో-సీఎన్‌జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి పశు, పంట వ్యర్థాల క్లస్టర్లను వాటికి అనుసంధానించాలి. యజమానులు లేని పశువులకు ఆశ్రయం కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తోంది. అలాంటి పశు సంరక్షణ కేంద్రాలకు అనుబంధంగా బయో-సీఎన్‌జీ ప్లాంట్ల ఏర్పాటుకు రాయితీలు అందించాలి. గెయిల్ లేదా రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వాటి నుంచి ఉత్పత్తి అయ్యే బయో-సీఎన్‌జీని కొనుగోలు చేసి దగ్గరలోని నగరాలకు వంట కోసం సరఫరా చేయవచ్చు. స్థానికులకు తక్కువ ధరకే గ్యాస్‌ను అందించేందుకు ప్రతి జిల్లాకు ఒకటి లేదా రెండు పెద్ద బయో-సీఎన్‌జీ ప్లాంట్లు; చిన్న, మధ్య తరహా యూనిట్ల వ్యవస్థలు అవసరమవుతాయి. వీటి నుంచి వెలువడే వ్యర్థాలను దగ్గరలోని బయో-ఫెర్టిలైజర్ యూనిట్లకు అందిస్తే, అవి రైతుల కోసం ప్రకృతి సిద్ధ ఎరువులను రూపొందిస్తాయి. దీనివల్ల రసాయన ఎరువుల దిగుమతి భారమూ దిగివస్తుంది. సాగు భూముల పునరుజ్జీవానికీ మార్గం ఏర్పడుతుంది. గ్యాస్ ధరలు పెరిగితే పల్లెల్లో కట్టెపొయ్యిల వాడకం వైపు మళ్లుతారు. ఇది అడవులకు చేటు చేసే ప్రమాదముంది. కాబట్టి, వన సంరక్షణకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలి. అవసరాన్ని బట్టి వంట కోసం పిడకల వినియోగాన్ని ప్రోత్సహించవచ్చు. ఎల్‌పీజీ తదితరాలతో పని లేకుండా వంట ఇంధన అవసరాలను పునస్సమీక్షించుకుని, పర్యావరణ హితకర సంప్రదాయ పద్ధతుల వైపు మళ్లాల్సిన అవసరం ఉంది. యూరియా తయారీకీ బయో-సీఎన్‌జీ ఉపయోగపడుతుంది. దీని ఉత్పత్తిపై దేశవ్యాప్తంగా పెట్టుబడులు పెడితే గల్ఫ్ గ్యాస్‌పై ఆధారపడాల్సిన అగత్యం క్రమంగా తప్పుతుంది. దేశీయంగానే పెద్దమొత్తంలో పర్యావరణ అనుకూల యూరియానూ తయారు చేసుకోవచ్చు. బయో-సీఎన్‌జీ ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు మన దగ్గర ఉన్నాయి. అయితే, ప్రభుత్వ పరిశోధనా సంస్థల నుంచి మరిన్ని సాంకేతిక ఆవిష్కరణలు, భారతీయ వ్యాపార సంస్థలతో భాగస్వామ్యాల ద్వారా అనతి కాలంలోనే ఉత్పత్తిని పెంచవచ్చు.

### సౌరశక్తి సాయంతో...

బయో-సీఎన్‌జీ కార్యక్రమం గ్రామాలకే పరిమితం కాకూడదు. రాబోయే రోజుల్లో పట్టణాలు, నగరాల్లో పెద్ద అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, స్కూళ్లు, రెస్టారెంట్లు వంటివి ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లను నెలకొల్పడంతో పాటు బయోగ్యాస్ ఉత్పత్తి చేయడాన్నీ ప్రభుత్వాలు తప్పనిసరి చేయాలి. ప్రస్తుతం ఇళ్లలో ఆహార వ్యర్థాల నుంచి బయోగ్యాస్‌ను స్వల్ప మొత్తంలో ఉత్పత్తి చేస్తున్నారు. ఈ సాంకేతికతను మరింత విస్తరించాలి. పల్లెలు, బ్లాక్ స్థాయుల్లో బయోగ్యాస్ ఉత్పత్తికి అవకాశమున్న చిన్న టాయిలెట్ కాంప్లెక్సులను నిర్మించాలి. రవాణా అవసరాలకు బయో-సీఎన్‌జీ వినియోగాన్ని పెంచాలి. పూర్తిగా బయో-సీఎన్‌జీ సిలిండర్లను ప్రజలకు పంపిణీ చేసే అవకాశాలనూ పరిశీలించాలి. ప్రధాన నగరాలు, పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణ విభాగాలు మీథేన్ లేదా బయోగ్యాస్‌ను సంగ్రహించే ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వాలు తప్పనిసరిగా సూచించాలి. ఇందుకు అవసరమైన మౌలిక వసతుల్ని తీర్చిదిద్దాలి. బయోగ్యాస్‌తో పాటు సౌరశక్తినీ వంటకు వాడుకోవడాన్ని పెంచాలి. మన దేశంలో ముఖ్యంగా సోలార్ వంట పరికరాలు, వాటిపై పరిశోధనల కొరత నెలకొంది. దేశీయంగా పుష్కలంగా సూర్యరశ్మి లభిస్తుంది. దాన్ని సమర్థంగా వినియోగించుకోవాలి. ఇళ్లకోసం సౌర వంట యూనిట్ల ఏర్పాటుపై నూతన పరిశోధనలకు ఊతమివ్వాలి. సంబంధిత పరికరాల ధరలు దిగివచ్చేలా చూడాలి. రాత్రి వేళ కూడా పనిచేసేలా అధునాతన సోలార్ ఎలక్ట్రిక్ హైబ్రిడ్ కుక్కర్లను అందుబాటు ధరల్లో మార్కెట్లలోకి తేవాలి. ఉష్ణతాపం అధికంగా ఉండే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఇందుకు ప్రత్యేక రాయితీలు కల్పించాలి. సంబంధిత సాంకేతికతను వంటలో వినియోగించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలి.

# ఆచితూచి రూపొందించిన వాస్తవిక బడ్జెట్



ప్రపంచవ్యాప్తంగా మారుతున్న భౌగోళిక పరిస్థితులు, రాష్ట్ర ఆర్థిక వనరులు, పెరుగుతున్న ద్రవోల్బణం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి రూపొందించిన వాస్తవిక బడ్జెట్‌గా శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కనబడుతుంది.

ప్రతిపాదించిన 3,24,234 కోట్ల బడ్జెట్‌లో ప్రాధాన్యతా రంగాలుగా విద్యారంగానికి రూ. 26,674 (8.22%) కోట్లు, వైద్య రంగానికి రూ. 13,679 (4.21%) కోట్లు, వ్యవసాయ రంగానికి రూ. 23,179 (7.14%) కోట్లు బీసీ సంక్షేమ రంగానికి రూ. 12,511 (3.85%) కోట్లు, గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్‌లు ఉన్నాయి.

### ఈ రంగాలకు పెద్దపీట

సామాన్యుని సంపాదనలో సింహభాగం విద్యా, వైద్యాలకే ఖర్చు అవుతుంది. విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేసిన రాష్ట్రాలు అభివృద్ధి సూచికలో ముందు వరుసలో ఉన్నాయి. గత బడ్జెట్‌తో పోల్చుకుంటే ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి, వైద్య రంగానికి, బీసీ సంక్షేమానికి అధికంగా కేటాయించారు. విద్య వైద్య రంగానికి అధిక కేటాయింపులు చేస్తే ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందే అవకాశం మెరుగవుతుంది.

### విద్యారంగ బడ్జెట్ ఇంకా పెంచాలి!

దేశంలో నాణ్యమైన విద్యను అందించడం కోసం ఆయా రాష్ట్రాలు వాటి బడ్జెట్లో బిహార్ 21.7% ఢిల్లీ 21.4% రాజస్థాన్ 19% హిమాచల్ ప్రదేశ్ 18.9% విద్యా రంగానికి నిధులు కేటాయించాయి. అదే దక్షిణాది రాష్ట్రాల బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపుల్ని ఒకసారి పరిశీలిస్తే, తమిళనాడు 14%, ఒడిస్సా 14% కేరళ 13.4% ఆంధ్రప్రదేశ్ 12.6% కేటాయింపులు జరిపాయి. మేము అధికారంలోకి వస్తే విద్యారంగానికి కనీసం 15% నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడు సంవత్సరాల బడ్జెట్లలో 7.3% ,7.57%, 8.22% నిధులు మాత్రమే కేటాయించింది.

### ప్రపంచ స్థాయిలో పోటీ పడాలంటే..!

బడ్జెట్‌లో చెబుతున్నట్లు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్‌కి కనీసం 9 వేల కోట్లు, పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించడానికి 250 కోట్లు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం 170 కోట్లు, పాలిటెక్నిక్ కళాశాల అప్‌గ్రెడేషన్ కోసం 2500 కోట్లు అవసరంఅవుతాయని విద్యాశాఖ ప్రాథమిక అంచనా వేసింది. తీరా బడ్జెట్ కేటాయింపులు పరిశీలిస్తే, విద్యారంగానికి గత సంవత్సరంతో పోల్చితే 0.65% అధికంగా కేటాయింపులు ఈ బడ్జెట్‌లో జరిగాయి. ఈ నామమాత్రం పెంపుదల కేటాయింపులతో తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ప్రపంచ స్థాయితో పోటీపడాలన్న ప్రభుత్వ లక్ష్యం ఏ విధంగా నెరవేరుతుందన్నది ప్రశ్న. అయితే బడ్జెట్‌లో విద్యార్థులకు అల్పాహారం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఐటీఐ, ఐటీసీల్లో చదివే విద్యార్థులకు 2000 స్కాలర్షిప్ అందించే ప్రతిపాదనలు హర్షనీయం.

ప్రాథమిక విద్య బలోపేతం!

ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 33 జిల్లాలలో 1,362 ప్రీ-ప్రైమరీ సెక్షన్లు ఏర్పాటు, రాబోయే విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని 2,000 నుండి 2,500 ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం ప్రాథమిక విద్య బలోపేతానికి దోహదపడుతాయి. చదువు లేకపోతే జ్ఞానం రాదు, జ్ఞానం రాకపోతే నైతిక విలువలు ఉండవు, నైతిక విలువలు లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదు, సమాజంలోని అట్టడుగు వర్గాలకు విద్య ఉంటే ఇవన్నీ సాధ్యమవుతాయని పూలే చెప్పిన మాటలు గమనంలోకి తీసుకొని విద్యారంగానికి కనీసం 15%- 20% నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

### నాణ్యమైన వైద్య సేవలు అందాలంటే..!

కరోనా తర్వాత ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగింది. బడ్జెట్‌లో 4.21% నిధులతో తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకి నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించడం కష్టం. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే కేవలం రూ.1286 కోట్లు ఈ బడ్జెట్లో అధికంగా వైద్యరంగానికి కేటాయించడం జరిగింది. రాష్ట్రంలోని ఒక కోటి 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అందిస్తామని బడ్జెట్లో ప్రకటించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ఈ పథకం దోహదపడుతుంది. కానీ వైద్య రంగానికి తక్కువ కేటాయింపులతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఎలా అందించగలం.

బీసీ కేటాయింపులు సరిపోతాయా?

తెలంగాణ రాష్ట్రంలో 56.39% బీసీలు ఉన్నారని ప్రభుత్వ అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. బడ్జెట్లో బీసీ సంక్షేమానికి కేవలం 3.85% నిధుల కేటాయింపు మాత్రమే జరిగింది. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు మరీ ఇంత తక్కువ బడ్జెట్ కేటాయింపులు వారి సంక్షేమానికి ఏ విధంగా సరిపడతాయి? ఎస్సీ ఎస్టీ మైనారిటీల సంక్షేమానికి కూడా కేటాయింపుల్లో ఏ పెంపుదలా లేకపోవడం గమనార్హం.

### పీఆర్సీ ప్రతిపాదన ఏది?

ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలకు కేటాయించిన నిధులకు ఏ మాత్రం పొంతన లేదు. విద్యారంగానికి ప్రాధాన్యతమిస్తున్నామని చెబుతూనే నామమాత్ర పెంపుతో కేటాయింపులు జరిపారు. రైతును రాజును చేస్తామని చెబుతూ రైతన్న సంక్షేమానికి, వ్యవసాయానికి వెన్ను దన్నుగా నిలిచే చర్యలు లేకపోవడం గమనార్హం. ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమని కట్టుబడి ఉన్నామని చెబుతూ పీఆర్సీపై ఎలాంటి ప్రతిపాదన లేకపోవడం, కేవలం ఈహెచ్ఎస్ గురించిన ప్రస్తావన చేశారు. స్థూలంగా బడ్జెట్‌ని విశ్లేషిస్తే అంతంత మాత్రమే ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రపంచ వ్యాప్త భౌగోళిక పరిస్థితికి అడ్డం పడుతూ సంక్షేమ రంగానికి నిధుల కేటాయింపు కొనసాగిస్తూ ఆచితూచి రూపొందించిన వాస్తవిక బడ్జెట్‌గా ఉంది.

# ఒకప్పటి పాలకులు తెరపైకి తీసుకొచ్చి వాయిదా

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నది ప్రక్షాళన పేరిట తీరం అమ్మకానికి సర్కార్ ప్రణాళికలు రచిస్తున్నదని నిపుణులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా నది తీరాలలోని భూమి వినియోగమార్పిడి, కాంక్రీట్ నిర్మాణాల వల్ల ఆర్థిక అభివృద్ధి సాధిస్తామని చెప్పడం సరైన విధానం కాదు. నదులు కలిగిన నగరాల్లో మురుగునీటి వ్యవస్థ దశాబ్దాల క్రితమే నిర్మితమై ఉన్నది. సంస్థాగతమైన పరిపాలన, రవాణా, మౌలిక సదుపాయాలు కూడా అభివృద్ధి చెంది ఉన్నాయి. ఇప్పుడు నది ప్రక్షాళన, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక వృద్ధి పేరుతో ప్రభుత్వం తెరపైకి తీసుకొస్తున్న ప్రణాళికల ఆంతర్యాలేమిటి అన్నది ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించుకుంటూ తెరపైకి తెచ్చింది. వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కూడిన ప్రాజెక్టుతో మూసీకి పునరుజ్జీవం కల్పిస్తామని చెప్తున్నది. కానీ ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ వివాదంలో చిక్కుకున్నది. మూసీ తీర ప్రాంతాల్లోని ప్రజలను నిర్వాసితులు చేయడం, ప్రాజెక్టు వ్యయాన్ని భారీగా పెంచడం ఇందుకు కారణం. ఇటీవల మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్-(ఎంఆర్‌డీసీఎల్) ఇచ్చిన ప్రజెంటేషన్ ప్రకారం చూస్తే ఈ ప్రాజెక్టులో కొత్తదనం ఏమీ కనిపించడంలేదు. గండిపేట్-లంగర్‌హౌజ్ కారిడార్ నుంచి తూర్పు-పశ్చిమ రహదారి, గాంధీ సరోవర్ రూపకల్పన, నదీతీరం సుందరీకరణ వరకు ఇవన్నీ గతంలో 1998 నాటి నుంచి ప్రచారంలో ఉన్న ప్రభుత్వాల ప్రతిపాదనలను పోలి ఉన్నాయి. ఇది కొత్త ప్రాజెక్ట్ కాదనేది ప్రధానమైన విషయం. ఇక మారింది ఏంటంటే కేవలం ప్రాజెక్ట్ వ్యయం, కన్సల్టెంట్ కంపెనీ మాత్రమే. ఎంఆర్‌డీసీఎల్ ప్రజెంటేషన్ ప్రకారం కన్సల్టెంట్ కంపెనీ ఫీజు రూ.160 కోట్లు. మరి ఇంత ఫీజు తీసుకున్న కన్సల్టెంట్ కంపెనీ కొత్త ఆలోచనలు ఏమైనా చేసిందా? కొత్త ప్రతిపాదనలు ఏమైనా రూపొందించిందా అంటే అదీ లేదు. ఒకప్పటి పాలకులు తెరపైకి తీసుకొచ్చి వాయిదా వేసిన అదే ప్రాజెక్టును వ్యయం పెంచి మళ్లీ ఖరీదైన ప్యాకేజీగా రూపకల్పన చేశారని స్పష్టమవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రజెంటేషన్‌లో కొన్ని నిరర్థకమైన వాదనలు, అసత్యాలు గమనించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు నగరాలు, అక్కడి నదుల తీరాల వల్ల ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చెందాయని చెప్పడం నిరాధారం. వాస్తవాలను గమనిస్తే ఈ వాదన నిలబడదు. కానీ ఇదే అంశాన్ని ప్రజెంటేషన్‌లో ప్రభుత్వం నొక్కి చెప్తూ వచ్చింది. భూమి వినియోగ మార్పిడి, నదీ గర్భంలో కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడం సంపదను సృష్టించే నమూనా గా చూడకూడదు. భూమి విలువ పెంపు, మెరుగైన రవాణా సదుపాయాల కల్పన, ఉద్యోగ కల్పన వికేంద్రీకరణ, వాణిజ్యపరంగా స్థలాలు అందుబాటులో ఉంచే విధానాలు, సమాజంలోని అందరినీ భాగస్వాములు చేయడం, పట్టణ సమగ్ర అభివృద్ధి ప్రణాళికల ద్వారా మాత్రమే నిజమైన ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఇచ్చిన ప్రజెంటేషన్‌లో ఇవేమీ కనిపించడంలేదు. పైగా ప్రభుత్వం ప్రస్తావించిన నగరాల జాబితా చూసినా ఎంపిక చేసిన కొన్నింటిని ప్రస్తావించినట్టుగా గమనించవచ్చు. పోనీ ఆయా నదీతీరాల్లో జరిగిన అభివృద్ధిగా చెప్తున్న నమూనా తీరుతెన్నులను పరిశీలించినా కాంగ్రెస్ సర్కార్ వాదన అసంబద్ధమే అనే విషయం స్పష్టమవుతుంది. ప్రజెంటేషన్‌లో పేర్కొన్న సియోల్‌లోని చియాంగ్‌గ్యేచియాన్ తీరం. ఇది పంపింగ్ చేసిన నీరు ప్రవహించే ఒక కాంక్రీట్ చానల్. దీని నిర్వహణ భారం కూడా చాలా అధికం అనే విమర్శలు ఉన్నాయి. పర్యావరణపరంగా ఇదొక డొల్ల ప్రాజెక్టు అని కొరియన్ సంస్థలు తమ అధ్యయనంలో పేర్కొన్నాయి. అంతేకాకుండా ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టిన నగరాల్లో అంతకు దశాబ్దాలకు ముందే మురుగునీటి పారుదల, సంస్థాగతమైన పరిపాలన, రవాణా వ్యవస్థలు అభివృద్ధి చెంది ఉన్నాయి. అక్కడ నదీ తీర అభివృద్ధి అనేది చివరగా చేపట్టిన ప్రాజెక్టే తప్ప, మొదటగా చేపట్టిన ప్రాజెక్టు కాదు. హైదరాబాద్ విషయానికి వస్తే ఈ క్రమానికి ప్రభుత్వం తిరోగమనంలో వెళ్తున్నట్టుగా కనిపిస్తున్నది. ప్రాజెక్ట్ పూర్తయితే ఇలా ఉంటుంది అంటూ ప్రభుత్వం చెప్తున్నది కానీ, వాటిని ఎలా నిర్వహిస్తారు? అందుకోసం రూపొందించే వ్యవస్థలు ఏంటి? నిర్వహణ వ్యయం ఎంతో చెప్పడంలేదు. గోదావరి నీటిని తరలించి మూసీలోకి వదులుతామని ప్రభుత్వం చెప్తున్నది. మురుగునీటి సమస్యను పరిష్కరించకుండా శుద్ధ జలాలను నదిలో నింపడం ద్వారా సమస్య పరిష్కారం కాదు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డ్ అంచనా ప్రకారం 2051 వరకు 62 ఎస్టీపీలు అవసరం. కానీ ప్రభుత్వ ప్రణాళికలో స్పష్టతలేదు. మురుగునీటిపై స్పష్టత ఇవ్వకుండా నదీతీరాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పడంలో అర్థంలేదు. కానీ మొదటిదశ ప్రాజెక్టుకు రూ.6,500-7,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వ వర్గాల అంచనా. ప్రభుత్వం చెప్తున్న ప్రజెంటేషన్ ద్వారా మనకు ఒక విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. హైదరాబాద్ పరిధిలోని 55 కిలోమీటర్ల పొడవైన నదీతీర అభివృద్ధి ద్వారా లాభాలు కలుగుతాయని ప్రభుత్వం పదేపదే చెప్పుకొస్తున్నది. కానీ ఎవరికి లాభాలు కలుగుతాయి? అనేది ప్రశ్న. దీనికి సమాధానం బహిరంగ రహస్యమే. ఇక మూసీ ప్రాజెక్టులో భాగంగా జీవో ఆర్టీ నంబర్ 921 ద్వారా ప్రభుత్వం 46 కాలనీలను తొలగించాలని భావిస్తున్నది. అంతేకాకుండా ఇండ్లను కూల్చడం, ప్రజలను అక్కడి నుంచి తరలించడం కోసం సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ కూడా చేపట్టకూడదని నిర్ణయించింది. అప్పుల భారంతో ఉన్న ఒక రాష్ట్ర ప్రభుత్వం నదీతీర అభివృద్ధి ద్వారా అక్కడి భూముల విలువ పెంచుతామని చెప్పినా అది పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక అభివృద్ధిగా పరిగణనలోకి తీసుకునే పరిస్థితి ఉండదు.

# వినియోగదారులకు గుడ్‌న్యూస్.. ఎస్‌బీఐ భారీ కానుక..!




ఈ కొత్త రేట్లు అన్ని కొత్త డిపాజిట్లపై, అలాగే మెచ్యూరిటీ సమయంలో ఇప్పటికే ఉన్న డిపాజిట్ల పునరుద్ధరణపై కూడా వర్తిస్తాయి. బ్యాంకు ప్రకారం, రిటైల్, బల్క్ టర్మ్ డిపాజిట్లు రెండింటికీ సంబంధించిన ఇతర నిబంధనలు, షరతులలో ఎటువంటి మార్పు లేదు. గడువుకు.. దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన ఎస్‌బిఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), తన వినియోగదారులకు ఒక ముఖ్యమైన కానుకను అందించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రూ.3 కోట్లకు పైబడిన బల్క్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు (బిపిఎస్) పెంచింది. ఈ కొత్త రేట్లు మార్చి 15, 2026 నుండి అమల్లోకి వచ్చాయి. ఈ పరిమితి కంటే తక్కువ ఉన్న డిపాజిట్ల రేట్లలో ఎలాంటి మార్పు ఉండదు.

**బ్యాంకు ఏ కాలపరిమితికి ఖీణ వడ్డీ రేటును పెంచింది?**

ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లలో ఈ 25 బేసిస్ పాయింట్ల పెంచింది. ఎంచుకున్న కాలపరిమితికి మాత్రమే పరిమితం. 46 రోజుల నుండి 179 రోజుల మధ్య కాలపరిమితి ఉన్న బల్క్ డిపాజిట్లపై వడ్డీ రేటును 5.10% నుండి 5.35%కి పెంచారు. 180 రోజుల నుండి ఒక సంవత్సరం లోపు కాలపరిమితి ఉన్న డిపాజిట్లపై రేటును 5.60% నుండి 5.85%కి పెంచారు. ఒక సంవత్సరం నుండి రెండు సంవత్సరాల లోపు కాలపరిమితి ఉన్న డిపాజిట్లపై రేటును 6.25% నుండి 6.50%కి పెంచారు.

**వయోవృద్ధులకు:**

అధిక రాబడులు కొనసాగుతాయి. 46 నుండి 179 రోజుల కాలపరిమితి గల డిపాజిట్లపై వారికి వడ్డీ రేటును 5.60% నుండి 5.85%కి పెంచారు. 180 రోజుల నుండి ఒక సంవత్సరం లోపు మెచ్యూర్ అయ్యే డిపాజిట్లపై ఇప్పుడు 6.35% రాబడి లభిస్తుంది. ఇది గతంలో 6.10%గా ఉండేది. ఒక సంవత్సరం లోపు నుండి రెండు సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లపై సవరించిన వడ్డీ రేటు 7%గా ఉంది. ఇది గతంలో 6.75%గా ఉండేది. ఈ కొత్త రేట్లు అన్ని కొత్త డిపాజిట్లపై, అలాగే మెచ్యూరిటీ సమయంలో ఇప్పటికే ఉన్న డిపాజిట్ల పునరుద్ధరణపై కూడా వర్తిస్తాయి. బ్యాంకు ప్రకారం, రిటైల్, బల్క్ టర్మ్ డిపాజిట్లు రెండింటికీ సంబంధించిన ఇతర నిబంధనలు, షరతులలో ఎటువంటి మార్పు లేదు. గడువుకు ముందే డబ్బును ఉపసంహరించుకునే పెట్టుబడిదారులు జరిమానా చెల్లించవలసి ఉంటుంది. ఎస్‌బిఐ అన్ని కాలపరిమితుల బల్క్ డిపాజిట్లపై 1% జరిమానాను యథాతథంగా కొనసాగించింది. దీని అర్థం గడువుకు ముందే డబ్బును ఉపసంహరించుకుంటే వర్తించే వడ్డీ రేటు 1% తగ్గుతుంది.

# భారతదేశానికి భారీ ఊరట.. ఇరాన్ నుండి చమురు కొనుగోలుకు కుదిరిన బిగ్ డీల్..!



తాము ఇరాన్ చమురును కొనుగోలు చేయాలని యోచిస్తున్నామని, అయితే ప్రభుత్వ ఆదేశాలు, అమెరికా నుండి చెల్లింపు నిబంధనలపై స్పష్టత కోసం ఎదురుచూస్తున్నామని ముగ్గురు భారతీయ రిఫైనింగ్ వర్గాలు తెలిపాయి. ఇతర ప్రధాన ఆసియా దేశాలతో పోలిస్తే తక్కువ చమురు నిల్వలు కలిగిన భారతదేశం, ఇటీవలి అమెరికా రాయితీల నేపథ్యంలో రష్యా చమురును కొనుగోలు చేయడంలో కూడా వేగంగా స్పందించింది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, భారతదేశానికి ఒక పెద్ద ఊరట లభించింది. అమెరికా ప్రభుత్వం ఆకస్మికంగా తన నిర్ణయాన్ని మార్చుకుని, ఇరాన్ చమురుపై తాత్కాలిక మినహాయింపు ఇచ్చింది. దీంతో భారతీయ రిఫైనరీలు ఇరాన్ చమురును తిరిగి కొనుగోలు చేసేందుకు అనుమతి లభించింది. ఇంధన సంక్షోభం తీవ్రమవుతున్న తరుణంలో, ఆసియా దేశాలు కొత్త ప్రత్యామ్నాయాల కోసం అన్వేషిస్తున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది. తాము ఇరాన్ చమురును కొనుగోలు చేయాలని యోచిస్తున్నామని, అయితే ప్రభుత్వ ఆదేశాలు, అమెరికా నుండి చెల్లింపు నిబంధనలపై స్పష్టత కోసం ఎదురుచూస్తున్నామని ముగ్గురు భారతీయ రిఫైనింగ్ వర్గాలు తెలిపాయి. ఇతర ప్రధాన ఆసియా దేశాలతో పోలిస్తే తక్కువ చమురు నిల్వలు కలిగిన భారతదేశం, ఇటీవలి అమెరికా రాయితీల నేపథ్యంలో రష్యా చమురును కొనుగోలు చేయడంలో కూడా వేగంగా స్పందించింది. ఇరాన్ చమురు కొనుగోలుపై అమెరికా ప్రభుత్వం 30 రోజుల మినహాయింపును మంజూరు చేసింది . స్కాట్ బెస్సెంట్ ప్రకారం, ఈ మినహాయింపు మార్చి 20వ తేదీ నాటికి ఓడల్లోకి ఎక్కించి, ఏప్రిల్ 19వ తేదీ నాటికి డెలివరీ చేయాల్సిన చమురు రవాణాలకు వర్తిస్తుంది. ముఖ్యంగా, 2018లో డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై కఠినమైన ఆంక్షలు విధించారు. కానీ ఇప్పుడు అదే ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనం కల్పిస్తుండటాన్ని ఒక పెద్ద యూ-టర్న్‌గా పరిగణిస్తున్నారు. భారతదేశంతో పాటు, ఇతర ఆసియా రిఫైనరీలు కూడా ఇరాన్ చమురును కొనుగోలు చేయగలమా లేదా అని పరిశీలిస్తున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు, సరఫరా అంతరాయాలు ఈ ప్రాంతంలోని రిఫైనరీలను తక్కువ సామర్థ్యంతో పనిచేయడానికి, ఇంధన ఎగుమతులను తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే, భారీ చమురు నిల్వలు సముద్రంలో చిక్కుకుపోయాయని, ఓడల్లో సుమారు 17 కోట్ల బ్యారెల్ల ఇరాన్ ముడి చమురు ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఈ నిల్వలు పరిమిత కాలం పాటు మాత్రమే ఉపశమనం కలిగించగలవని నిపుణులు భావిస్తున్నారు. ఆసియా తన చమురు అవసరాలలో సుమారు 60 శాతం కోసం మధ్యప్రాచ్యంపై ఆధారపడటం, ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. 2018లో ఆంక్షలు విధించిన తర్వాత చైనా.. ఇరాన్ చమురుకు అతిపెద్ద కొనుగోలుదారుగా మారింది. గణాంకాల ప్రకారం, ఆంక్షల కారణంగా ఇరాన్ చమురు చౌక ధరలకు లభ్యం కావడంతో, దాని స్వతంత్ర రిఫైనరీలు గత సంవత్సరం రోజుకు సుమారు 1.38 మిలియన్ బ్యారెల్లను కొనుగోలు చేశాయి. చెల్లింపు ఏర్పాట్లపై అనిశ్చితి, పాత నౌకల వాడకం వంటి సవాళ్లను ఇరాన్ చమురు కొనుగోలు ఎదుర్కోవచ్చు. అంతేకాకుండా, గతంలో చాలా మంది కొనుగోలుదారులకు నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీతో ఒప్పందాలు ఉండేవి, కానీ ఇప్పుడు చాలా వరకు చమురు థర్డ్-పార్టీ వ్యాపారుల ద్వారా అమ్ముడవుతోంది. నిబంధనలు, బ్యాంకింగ్ విధానాలను అర్థం చేసుకోవడానికి సమయం పట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# పూర్తిగా మారనున్న పాన్ కార్డు రూల్స్.. కేంద్రం కఠిన నిబంధనలు జారీ.. ఏప్రిల్ 1 నుంచే..




ఏప్రిల్ 1వ తేదీ నుంచి పాన్ కార్డు రూల్స్ పూర్తిగా మారనున్నాయి. కొత్తగా పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారితో పాటు వివరాలు అప్డేట్ చేసుకోవాలనుకునేవారికి కొత్త నిబంధనలు రానున్నాయి. దేశ ప్రజలను ప్రభావితం చేయనున్న ఈ నియమాల గురించి ప్రతీఒక్కరూ తెలుసుకోవాల్సిందే. ఏప్రిల్ 1వ తేదీ నుంచి పాన్ కార్డు రూల్స్ మారబోతున్నాయి. పాన్ కార్డు దరఖాస్తు నిబంధనలకు కేంద్ర ప్రభుత్వం సవరింపులు చేసింది. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి కొత్త నిబంధనలు ప్రవేశపెట్టింది. ఈ ముఖ్యమైన మార్పులకు సంబంధించిన వివరాలను సీఎస్‌సీ ఈ గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపింది. ప్రస్తుతం ఆధార్ కార్డు ఉపయోగించి పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఒక్క ఆధార్ కార్డు ఇస్తే సరిపోతుంది. ఇక ఎలాంటి అదనపు డాక్యుమెంట్స్ ఇవ్వాల్సిన అవసరం ఉండేది కాదు. మార్చి 31 వరకు మాత్రమే ఈ సదుపాయం అమల్లో ఉంటుంది. ఆ తర్వాత పాన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే అదనంగా మరో గుర్తింపు ధృవీకరణ పత్రం అందించాల్సి ఉంటుంది. త్వరలో రానున్న మార్పులు ఏంటో వివరంగా చూద్దాం.

**అదనపు పత్రాలు అవసరం**

ఇప్పటివరకు పాన్ పొందేందుకు ఆధార్ ఉంటే సరిపోయేది. కానీ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆధార్‌తో పాటుగా మరో ధృవీకరణ పత్రం ఖచ్చితంగా అందించాల్సి ఉంటుంది. దీంతో ఆధార్ కార్డు ద్వారా పాన్ పొందాలనుకునేవారికి ఇదే చివరి అవకాశంగా చెప్పవచ్చు. కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి ఆధార్‌తో పాటు డేట్ ఆఫ్ బర్త్, ఓటర్ ఐడీ, పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఇక ఆధార్ ప్రకారమే పాన్‌లో పేరు ఉంటుంది. దీంతో దరఖాస్తుదారులు ఆధార్ వివరాలు సరైనవని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఇక ఏప్రిల్ 1 నుంచి కొత్త ఫార్మట్‌లో పాన్ కార్డు దరఖాస్తు అప్లికేషన్లు ఉండనున్నాయి. ప్రస్తుతం ఫార్మట్ స్థానంలో కొత్త ఫారాలను తీసుకురానున్నారు. దీంతో పాన్ అప్లికేషన్లను ఇక స్వీకరించరు. పాన్ కోసం దరఖాస్తు చేసుకోవాన్నా లేదా వివరాలు అప్డేట్ చేసుకోవాలన్నా కొత్త అప్లికేషన్లు రానున్నాయి.

**ఈ-పాన్ పేరుతో మోసాలు**

ఈ-పాన్ డౌన్ లోడ్ పేరుతో మోసాలు జరుగుతున్నాయి. సెకన్లలోనే ఈ-పాడ్ డౌన్ లోడ్ చేసుకోండి అంటూ సైబర్ నేరగాళ్లు స్పామ్ లింకులు పంపుతున్నారు. ఆ లింక్‌లు క్లిక్ చేస్తే ఫోన్లలోకి మాల్‌వేర్ చొరబడి వ్యక్తిగత వివరాలు సేకరిస్తుంది. ఆ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కడం ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంక్, ఇతర వ్యక్తిగత వివరాలను తెలుసుకుంటున్నారు. దీంతో ఇలాంటి లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు చెబుతున్నారు. అలాంటి లింకులు కనిపిస్తే అసలు క్లిక్ చేయవద్దని చెబుతున్నారు. ఐటీ డిపార్ట్‌మెంట్ అలాంటి మెస్సేజ్‌లు అసలు పంపదని సూచిస్తున్నారు. ఒకవేళ అలాంటి లింక్‌లు కనిపిస్తే ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

# గత 15 ఏళ్లలో ఇదే భారీ తగ్గింపు.. ఇంకా రికార్డ్ స్థాయిలో తగ్గనున్న బంగారం, వెండి ధరలు.. ఎంతంటే..!



బంగారం, వెండి ధరలు ఎన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో దిగి వస్తున్నాయి. గత 15 ఏళ్లలో ఈ వారంలోనే భారీ తగ్గింపు అని నిపుణులు చెబుతున్నారు. అయితే రానున్న రోజుల్లో ఎంత తగ్గుతుందే వస్తున్న నివేదికలు వైరల్ అవుతున్నాయి.. ముడి చమురు ధరల పెరుగుదల, పశ్చిమ ఆసియాలో యుద్ధం చుట్టూ నెలకొన్న అనిశ్చితి కారణంగా ప్రపంచ మార్కెట్లో బంగారం, వెండి ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. శుక్రవారం బంగారం ధరలు మళ్లీ పడిపోయాయి. దేశీయ బులియన్ మార్కెట్, అంతర్జాతీయ మార్కెట్ రెండింటిలోనూ విలువైన లోహాల ధరలు భారీగా పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ ఫ్యూచర్స్ 0.7 శాతం పడిపోయి ఔన్సుకు వి4,574.90 వద్దకు చేరింది. ఈ వారంలో బంగారం, సుమారు 9.6 శాతం పడిపోయింది. ఇది సెప్టెంబర్ 2011 తర్వాత నమోదైన అతిపెద్ద క్షీణత. ఈ వారపు క్షీణత దాదాపు 15 సంవత్సరాలలో అతిపెద్ద వారపు క్షీణతను సూచిస్తుంది. భారతదేశంలో పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తుండటంతో ఇది కొనుగోలు చేయడానికి సరైన సమయమా కాదా అనే దానిపై ప్రజలు గందరగోళంలో ఉన్నారు. అదే సమయంలో పెట్టుబడిదారులు కూడా ఈ క్షీణత పట్ల ఆందోళన చెందుతున్నారు. మరి బంగారం ధరలు ఎటువైపు వెళ్తాయి.. వెండి పరిస్థితి ఎలా ఉంటుంది? నిపుణులు ఏమి చెబుతున్నారో తెలుసుకోండి.

**బంగారం, వెండి ధరలు తీవ్రంగా పడిపోయాయి:**

అమెరికా-ఇరాన్ యుద్ధం, పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితి పెట్టుబడిదారులను అప్రమత్తం చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఫ్యూచర్స్ 0.7 శాతం పడిపోయి ఔన్సుకు వి4,574.90కి చేరాయి. వెండి ఫ్యూచర్స్ 2 శాతానికి పైగా పడిపోయి ఔన్సుకు వి69.66కి చేరాయి. వెండి వరుసగా మూడవ వారం కూడా క్షీణించింది. ఈ కాలంలో ఇది 14 శాతానికి పైగా నష్టపోయింది.

**భారతదేశంలో కూడా బంగారంపై ఒత్తిడి:**

ప్రపంచ ఉద్రిక్తతలు భారత బులియన్ మార్కెట్‌పై కూడా ప్రభావం చూపాయి. మార్చి 20న ఎంసీఎక్స్ (వీజఽ)లో 10 గ్రాముల బంగారం ధరలు రూ.144,825 వద్ద ముగిశాయి. బంగారం ధరలు సుమారు 8.57% మేర పడిపోయి, తీవ్రంగా క్షీణించాయి. మార్చి 2000 సంవత్సరం తర్వాత నమోదైన అతిపెద్ద వారపు క్షీణతలలో ఇది ఒకటిగా పరిగణిస్తున్నారు.

**బంగారం ధర ఎందుకు పడిపోయింది?**

ప్రపంచ మార్కెట్లలో విస్తృతంగా జరుగుతున్న అమ్మకాలే ఈ పతనానికి ప్రధాన కారణమని కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ సురేష్ కేడియా అన్నారు. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారంతో పాటు ఈక్విటీలు, క్రిప్టో, రియల్ ఎస్టేట్ వంటి ఇతర ఆస్తి తరగతులలో తమ స్థానాలను తగ్గించుకున్నారు. అంతేకాకుండా యూఎస్ ఫెడరల్ రిజర్వ్ మదువైన వైఖరి, వడ్డీ రేట్ల కోతలలో జాప్యం జరిగే అవకాశం ఉంది. బంగారం వంటి వడ్డీ లేని పెట్టుబడుల ఆకర్షణను తగ్గించాయి. బలమైన యూఎస్ డాలర్, పెరుగుతున్న బాండ్ దిగుబడులు కూడా ధరలపై ఒత్తిడి తెచ్చాయి.

**ఈ క్షీణత మరింత కొనసాగే అవకాశం ఉంది:**

అజయ్ కేడియా ప్రకారం.. లాంగ్ పొజిషన్ల అమ్మకాలు, మార్జిన్ కాల్స్ వల్ల ఈ పతనం మరింత తీవ్రమైంది. దీనివల్ల ఇది సాంకేతికంగా ప్రేరేపించినట్లుగా కనిపిస్తోంది. ఈ పరిస్థితిలో పతనం కొనసాగుతుందని అంచనా. బంగారం ధరలు మరింత పడిపోవచ్చని ఇతర నిపుణులు కూడా భావిస్తున్నారు. ఈ ధోరణి కొనసాగితే, భారతదేశంలో బంగారం ధరలు 10 గ్రాములకు రూ.127,000కు, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సుకు వి4,250 కు పడిపోవచ్చు. ఇది పెళ్లిళ్ల సీజన్ కోసం షాపింగ్ చేసే వారికి ఒక అవకాశాన్ని కల్పిస్తుంది.

# వాట్సాప్‌లో ఒక్క మెసేజ్ పంపితే చాలు నిమిషాల్లోనే ఆధార్ కార్డు డౌన్‌లోడ్!




వాట్సాప్ ద్వారా ఆధార్ పొందడంలో ఉన్న అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే, ఇది పూర్తిగా ఉచితం. దీనికోసం ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా డిజిలాకర్ ద్వారా జారీ చేసిన ఈ డిజిటల్ పత్రం పూర్తిగా చట్టబద్ధంగా..

నేటి డిజిటల్ యుగంలో ఆధార్ కేవలం ఒక గుర్తింపు కార్డు మాత్రమే కాదు, మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. బ్యాంకు ఖాతా తెరవడానికైనా, కొత్త సిమ్ కార్డు పొందడానికైనా, లేదా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందడానికైనా, ప్రతిచోటా ఆధార్ అవసరం. తరచుగా, మన దగ్గర భౌతిక కార్డు లేనప్పుడు, మనకు అకస్మాత్తుగా ఆధార్ సాఫ్ట్ కాపీ అవసరం పడుతుంది.

ఈ సమస్యను పరిష్కరించడానికే భారత ప్రభుత్వానికి చెందిన ఖ×నూ×, వీఎ+శీజ ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఇప్పుడు మీ ఆధార్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడానికి మీరు కేఫ్‌కు వెళ్లడం గానీ, వెబ్‌సైట్‌లను సందర్శించడం లాంటివి చేయనవసరం లేదు. మీరు మీ ఫోన్‌లోని వాట్సాప్ ద్వారా క్షణాల్లో మీ ఇ-ఆధార్‌ను పొందవచ్చు.

**ప్రారంభించే ముందు ముఖ్యమైనది ఏమిటి?**

ఈ సౌకర్యాన్ని పొందాలంటే మీ దగ్గర మూడు విషయాలు తప్పనిసరిగా ఉండాలి.

1. మీ మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఆధార్‌తో అనుసంధానించబడి ఉండాలి.
2. మీకు తప్పనిసరిగా యాక్టివ్ డిజిలాకర్ ఖాతా ఉండాలి.
3. మీ వద్ద 12 అంకెల ఆధార్ నంబర్ ఉండాలి.

వాట్సాప్ నుండి ఆధార్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి?

పైన పేర్కొన్న వస్తువులు మీ వద్ద సిద్ధంగా ఉంటే ఈ 7 సులభమైన దశలను అనుసరించండి:

1. నంబర్‌ను సేవ్ చేసుకోండి: ముందుగా MyGov హెల్ప్‌డెస్క్ నంబర్ ం91-90131-51515ను మీ మొబైల్ కాంటాక్ట్స్‌లో సేవ్ చేసుకోండి.
2. చాట్ ప్రారంభించండి: మీ వాట్సాప్‌ను తెరిచి ఈ నంబర్‌కు "Hiμμ, »»Namaste" లేదా "Aadhaar" అని పంపండి.
3. సర్వీసును ఎంచుకోండి: చాట్‌బాట్ మీకు కొన్ని ఎంపికలను ఇస్తుంది. ఇక్కడ మీరు "డిజిలాకర్ సేవలు" పై క్లిక్ చేయాలి.
4. గుర్తింపును నమోదు చేయండి: ఇప్పుడు మిమ్మల్ని మీ 12-అంకెల ఆధార్ నంబర్ అడుగుతారు. దానిని జాగ్రత్తగా టైప్ చేసి సమర్పించండి.
5. OTP ధృవీకరణ: భద్రతా కారణాల దృష్ట్యా, మీరు నమోదు చేసుకున్న మొబైల్ నంబర్‌కు 6 అంకెల ాఘా వస్తుంది. దానిని చాట్ బాక్స్‌లో నమోదు చేయండి.
6. ఆధార్‌ను ఎంచుకోండి: ధృవీకరణ విజయవంతం అయిన తర్వాత బాట్ మీ డిజిలాకర్‌లో అందుబాటులో ఉన్న పత్రాల జాబితాను ప్రదర్శిస్తుంది. ఇక్కడ "ఆధార్" ఎంపికను ఎంచుకోండి.
7. PDF పొందండి: అంతే.. కేవలం కొన్ని సెకన్లలోనే మీ ఇ-ఆధార్ాణఖీ ఫైల్‌గా మీ వాట్సాప్‌కు వస్తుంది.

మీ ఫైల్‌ను ఎలా తెరవాలి? (పాస్‌వర్డ్ సమాచారం)

భద్రతా కారణాల దృష్ట్యా ఈ ాణఖీ ఫైల్ పాస్‌వర్డ్‌తో రక్షించబడింది. దీనిని తెరవడానికి ఒక నిర్దిష్ట ఫార్మాట్ ఉపయోగించండి.

ఫార్మాట్: మీ పేరులోని మొదటి 4 అక్షరాలు (పెద్ద అక్షరాలలో) ం మీ పుట్టిన సంవత్సరం.

ఉదాహరణకు: మీ పేరు సుమిత్, పుట్టిన సంవత్సరం 1992 అయితే, పాస్‌వర్డ్ ఇలా ఉంటుంది: ాఖవీ×1992.

**ఈ ఫీచర్ ప్రధాన ప్రయోజనాలు:**

వాట్సాప్ ద్వారా ఆధార్ పొందడంలో ఉన్న అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే, ఇది పూర్తిగా ఉచితం. దీనికోసం ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా డిజిలాకర్ ద్వారా జారీ చేసిన ఈ డిజిటల్ పత్రం పూర్తిగా చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుంది. తదుపరిసారి మీకు మీ ఆధార్ అవసరమైనప్పుడు, కంగారు పడకండి. కేవలం ఒక వాట్సాప్ సందేశం పంపి మీ పనిని సులభతరం చేసుకోండి.

# భారీ దెబ్బ.. ఇక నుంచి వీరికి ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు నిషేధం.. ప్రభుత్వం సంచలన నిర్ణయం!




యుద్ధం కారణంగా గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్న వారికి ఇప్పటికి అందలేదు. అయితే కమర్షియల్ గ్యాస్ వినియోగదారులకు మరి దారుణంగా ఉంది. ఈ నేపథ్యం ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి వీరు గ్యాస్ సిలిండర్లను పొందలేరు.. (పైప్డ్ నేచురల్ గ్యాస్) కనెక్షన్లు ఉన్నవారు ఎల్పీజీ సిలిండర్లను పొందడం లేదా రీఫిల్ చేసుకోవడాన్ని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ నిషేధించింది. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా సరఫరా సంబంధిత సమస్యలు తలెత్తిన తరుణంలో మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా, ఇజ్రాయెల్‌లతో ఇరాన్‌కు ఉన్న సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా గందరగోళాన్ని, అల్లకల్లోలాన్ని సృష్టించింది. ఇలాంటి తరుణంలో ఇప్పటికే పీఎన్‌జీ కనెక్షన్లు ఉన్న కుటుంబాలు రాయితీతో కూడిన ఎల్పీజీని దుర్వినియోగం చేయకుండా చూసేందుకు అలాగే పంపిణీని మెరుగుపరిచేందుకు శనివారం ఎల్పీజీ నియంత్రణ ఉత్తర్వును సవరించారు.

**కొత్త సరఫరా ఆర్డర్‌లో ఏముంది?**

కొత్త సరఫరా ఉత్తర్వు ప్రకారం.. ఇప్పటికే పీఎన్‌జీ నెట్‌వర్క్‌కు యాక్సెసిబిలిటీ ఉన్నవారికి కొత్త ఎల్‌పిజి కనెక్షన్‌లు లేదా రీఫిల్‌లు జారీ చేయడాన్ని ప్రభుత్వం చమురు కంపెనీలను నిషేధించింది. అంతేకాకుండా, పీఎన్‌జీ కనెక్షన్‌లు ఉన్నవారు తమ ఎల్‌పిజి కనెక్షన్‌లను కొనసాగించకుండా కూడా నిరోధిస్తారు. అంటే, ఇప్పటికే పీఎన్‌జీ, ఎల్‌పిజి కనెక్షన్‌లు రెండూ ఉన్న కుటుంబాలు తమ ప్రస్తుత ఎల్‌పిజి కనెక్షన్‌లను వదులుకోవలసి ఉంటుంది.

**అదిరిపోయే ప్లాన్.. చౌకైన రీఛార్జ్‌తో ఈ సర్వీసు 18 నెలలు ఉచితం!**

భారత జెండా కలిగిన రెండు ఎల్‌పిజి నౌకలు సుమారు 92,700 టన్నుల ఎల్‌పిజితో హోర్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటి భారతదేశం వైపు పయనిస్తున్నాయి. ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా మాట్లాడుతూ.. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధికి పశ్చిమాన పర్షియన్ గల్ఫ్‌లో 24 భారత జెండా కలిగిన నౌకలు నిలిచి ఉన్నాయని, వాటిలో ఎల్‌పిజిని తీసుకువెళ్తున్న శివాలిక్, నందా దేవి నౌకలు సురక్షితంగా మార్గాన్ని దాటాయని, త్వరలో భారత ఓడరేవులకు చేరుకుంటాయని భావిస్తున్నట్లు తెలిపారు. అవి మార్చి 16, 17 తేదీలలో ముంద్రా, కాండ్లా ఓడరేవులకు చేరుకుంటాయని అంచనా.

# నెలకు రూ. 2200 జమ చేస్తే చాలు.. మీ చేతికి రూ.1,57,004




పోస్టాఫీసులలో రకరకాల డిపాజిట్ పథకాలు ఉన్నాయి. పోస్ట్ ఆఫీసులలో చేసే డిపాజిట్లకు ఎలాంటి రిస్క్ ఉండదు. ఎందుకంటే ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో హామీ ఉంటుంది. తక్కువ డిపాజిట్లతో ఎక్కువ రాబడి పొందే పథకాలు ఎన్నో ఉన్నాయి.పోస్టాఫీసులలో అద్భుతమైన స్కీమ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు ఉత్తరాలకే పరిమితయ్యే పోస్టాఫీసులలో ఇప్పుడు ప్రభుత్వ పథకాలు ఎన్నో ఉన్నాయి. వివిధ రకాల డిపాజిట్లపై మంచి వడ్డీ రేట్లను అందిస్తోంది. ఎలాంటి రిస్క్ లేకుండా సంవత్సరాల తరబడి డిపాజిట్స్ చేసుకోవచ్చు. మీరు ఇండియన్ పోస్ట్ ఆఫీస్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. రికరింగ్ డిపాజిట్ (ఆర్డీ) పథకంలో పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు మంచి నిధిని ఏర్పాటు చేసుకోవచ్చు. మీరు ఈ పథకంలో 5 సంవత్సరాల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. మీరు పోస్ట్ ఆఫీస్ =ఐ పథకంలో ప్రతి నెలా రూ. 2200 జమ చేస్తే, 60 నెలల్లో ఎంత నిధి సిద్ధమవుతుంది?. ప్రతి నెలా ఒక స్థిరమైన మొత్తం రికరింగ్ డిపాజిట్‌లో జమ చేయబడుతుంది. పోస్ట్ ఆఫీస్ తన వినియోగదారులకు ఆర్డీ పథకంపై 6.7 శాతం వార్షిక వడ్డీని అందిస్తోంది. ఈ పథకంలో మీరు నెలకు కనీసం రూ. 100 పెట్టుబడితో ఖాతాను తెరవవచ్చు. పోస్ట్ ఆఫీస్ ఆర్డీ ఖాతా 5 సంవత్సరాలలో మెచ్యూర్ అవుతుంది. అయితే, ఖాతా తెరిచిన తేదీ నుండి 3 సంవత్సరాల తర్వాత కూడా దీనిని మూసివేయవచ్చు. మీరు పోస్ట్ ఆఫీస్ ఆర్డీ ఖాతాలో ప్రతి నెలా రూ. 2200 జమ చేస్తే 60 నెలల తర్వాత అంటే మెచ్యూరిటీ సమయంలో మీకు మొత్తం రూ. 1,57,004 లభిస్తాయి. మీరు డిపాజిట్ చేసిన రూ. 1,32,000తో పాటు ఈ మొత్తంలో రూ. 25,004 వడ్డీ కూడా కలిసి ఉంటుంది. పోస్ట్ ఆఫీస్ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వస్తుంది. అందువల్ల మీ డబ్బు మొత్తం అందులో పూర్తిగా సురక్షితంగా ఉంటుంది.

### రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న

# గుండేటి ఐలయ్య యాదవ్...



ఓదెల//మార్చి 21 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్ గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసాన్ని ముస్లిం సోదరులు ఎంతో నిష్టతో, కఠిన ఉపవాస దీక్షలతో, భక్తిశ్రద్ధలతో పూర్తి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల సమ్మేళనమే రంజాన్ పండుగ అని అన్నారు. రంజాన్ పండుగ పవిత్రతకు, త్యాగానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పవిత్ర వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని చెప్పిన ఆయన, అల్లాహ్ కృపతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కొలనూర్ గ్రామంలో జరిగిన ఈ ప్రత్యేక ప్రార్థనలు భక్తిశ్రద్ధల నడుమ కొనసాగగా, స్థానిక నాయకులు, ముస్లిం పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సోదరభావ వాతావరణం నెలకొంది.

### హర్మూజ్ జలసంధిని తెరవండి..

# ఇరాన్‌కు 22 దేశాల విజ్ఞప్తి...




న్యూఢిల్లీ//మార్చి 21 (ఆకాంక్ష) : గత కొన్ని రోజులుగా ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య భీకర యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ యుద్ధంలో ఇప్పటికే వేలాది మంది ప్రాణాలు కోల్పోగా.. ఎన్నో కోట్ల విలువైన ఆస్తిలు ధ్వంసమయ్యాయి. ఇంత జరిగిన ఈ యుద్ధ వాతావరణం చల్లారే పరిస్థితి కనిపించడం లేదు. ఈ యుద్ధం కారణంగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసేసింది. దీంతో ఇంధన లోటుతో పలు దేశాలు ఇబ్బందులు ఎదురుకుంటున్నాయి. తాజాగా హర్మూజ్ జలసంధిని తెరవాలని పలు దేశాలు ఇరాన్‌ను కోరాయి. దాడులను ఆపాలని కూడా ఇరాన్‌ను 22 సంయుక్త ప్రకటన చేశాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై దాడులను పలు దేశాలు ఖండించాయి. యుఎఇ, బహ్రెయిన్, యుకె, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా సహా పలు దేశాలు ఈ దాడులను ఆపాలని విజ్ఞప్తి చేశాయి. ఇరాన్ చర్యల వల్ల అన్ని దేశాల ప్రజలపై దుష్ప్రభావం పడుతోందని ప్రకటించాయి.

### తక్షణమే బడ్జెట్ ను సమీక్షించి బిసిల బడ్జెట్ ను

# రూ.20 వేల కోట్లకు పెంచాలి...

14 బీసీ సంఘాల అత్యవసర సమావేశం డిమాండ్...



హైదరాబాద్//మార్చి 21 (ఆకాంక్ష) : బడ్జెట్ లో బీసీలకు తీరని అన్యాయం చేశారని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ ఎంపీ, అర్.కృష్ణయ్య ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీసీ ఉద్యమం బలంగా ఉన్న తరుణంలో ఐది బీసీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ తెలంగాణా రాష్ట్ర బడ్జెట్ పై 14 బీసీ సంఘాల అత్యవసర సమావేశం జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బడ్జెట్ లో రూ.3 లక్షల 24 వేల కోట్లలో బీసీలకు కేవలం రూ.12,511 కోట్లు మాత్రమే కేటాయించి తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానంతో పాటు కామారెడ్డి డెకరేషన్ లో ప్రతి యేటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ప్రకటించి, మూడు సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టి కూడా వాగ్దానం నెరవేర్చలేదని విమర్చించారు.. తక్షణమే బడ్జెట్ ను సమీక్షించి ఎన్నికల వాగ్దానం ప్రకారం బడ్జెటు రూ.20 వేల కోట్లకు పెంచాలని డిమాండ్ చేసారు.. బీసీ కార్పోరేషన్, బీసీ కుల ఫెడరేషన్లకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని,ఒక్కో బీసీ కుటుంబానికి రూ.20 లక్షలతో పాటు 80 శాతం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు రాజేందర్, అనంతయ్య, జిల్లపల్లి అంజి, శివ కుమార్, నికిల్ ,ఆశిష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడులో మరో కొత్త రాజకీయ కూటమి ఏర్పాటు....

పీఎంకే రామదాస్ తో చేతులు కలిపిన శశికళ...

234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని నిర్ణయం...



చెన్నై//మార్చి 21 (ఆకాంక్ష) : త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తమిళనాడులో మరో కొత్త రాజకీయ కూటమి ఏర్పాటైంది. పట్టాలి మక్కల్ కచ్చి (పీఎంకే) వ్యవస్థాపకుడైన రామదాస్, దివంగత మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలైన శశికళ దీని కోసం చేతులు కలిపారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని ఈ కూటమి యోచిస్తున్నది. విల్లుపురం జిల్లా తైలపురంలోని రామదాస్ నివాసానికి శశికళ వెళ్లారు. కొత్త రాజకీయ కూటమి ఏర్పాటు గురించి సుమారు రెండు గంటల పాటు ఆయనతో చర్చించారు. కాగా, శశికళ సొంతంగా ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఐపీటీఎంఎంకే)తో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాము ఒప్పందం కుదుర్చుకున్నట్లు రామదాస్ తెలిపారు. 'ఈ పొత్తు ఇప్పటికే తమిళనాడులో బలమైన ప్రభావాన్ని చూపింది. పలువురు ప్రత్యర్థులను కలవరపరిచింది. మరిన్ని పార్టీలు మాతో చేరుతాయని భావిస్తున్నాం' అని మీడియాతో అన్నారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని తమ కూటమి యోచిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు పీఎంకే వ్యవస్థాపకుడైన రామదాస్, ఆయన కుమారుడు అన్బుమణి రామదాస్ మధ్య పార్టీపై నియంత్రణ అంశంలో విభేదాలున్నాయి. అలాగే అన్నాడీఎంకేలో తన ప్రభావాన్ని తిరిగి పొందడానికి శశికళ పోరాడుతున్నారు. పార్టీని ఏకం చేయడంలో విఫలమైన తర్వాత తన సొంత పార్టీ ఏఐపీటీఎంఎంకేను ఆమె ఏర్పాటు చేశారు. అయితే తమ మాతృ పార్టీల్లో అంతర్గత సవాళ్లను ఎందుర్కొంటున్న రామదాస్, శశికళ రాజకీయ ప్రాబల్యం పునరుద్ధరణ, తమ క్యాడర్‌ను పటిష్టం చేసుకోవడానికి ఈ పొత్తును ఒక మార్గంగా భావిస్తున్నారు. దీంతో వీరిద్దరూ కలిసి కొత్త రాజకీయ కూటమిని ఏర్పాటు చేశారు. కాగా, తమిళనాడులో ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరుగనున్నది.

# ఈ సీజన్‌లో చాలా మందికి వచ్చే గొంతు పొడిబారే సమస్య.. ఎందుకు వస్తుంది..



హైదరాబాద్//మార్చి 21 (ఆకాంక్ష) :శీతాకాలం ముగిసి ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభమైనప్పుడు, చాలా మందిలో ఒక సాధారణ సమస్య కనిపిస్తుంది. చాలా మందికి ఉదయం లేవగానే గొంతు ఎండిపోయినట్టు, గరుకుగా లేదా గొంతు బిగుసుకున్నట్టు అనిపిస్తుంది. వసంత కాలం పూలతో అందంగా ఉన్నప్పటికీ, అదే సమయంలో గాలిలో పుప్పొడి స్థాయిలు పెరుగుతాయి, వాతావరణ మార్పులు వేగంగా జరుగుతాయి. ఈ మార్పులు శ్వాసకోశ మార్గానికి చికాకును కలిగించి గొంతు అసౌకర్యానికి కారణమవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అలర్జీ సంబంధిత శ్వాస సమస్యలతో బాధపడుతున్నారు. భారతదేశంలో వసంత కాలంలో చెట్లు, గడ్డి నుంచి వచ్చే పొలెన్, ధూళి, కాలుష్యం, తేమ మార్పులన్నీ కూడా గొంతు, శ్వాసనాళాలపై ప్రభావం చూపుతాయి.

కారణాలు ఇవే..

అలాగే వసంతకాలంలో గొంతు ఎండిపోయినట్టు, పొడిగా అనిపించడానికి అనేక కారణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. వసంత కాలంలో మొక్కలు పెద్ద మొత్తంలో పుప్పొడిని విడుదల చేస్తాయి. ఈ చిన్న కణాలు శ్వాసలోకి వెళ్లినప్పుడు శరీరం హిస్టమిన్స్ ను విడుదల చేస్తుంది. దీంతో ముక్కు, గొంతులో వాపు వస్తుంది. దీని వల్ల గొంతు ఎండిపోవడం, దురద, దగ్గు, గొంతు గరుకుగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. గొంతులో చికాకుకు మరో సాధారణ కారణం పోస్ట్-నాసల్ డ్రిప్. ఈ పరిస్థితిలో మ్యూకస్ గొంతు వెనుక భాగంలో చేరుతుంది. ఇది నిరంతరం గొంతులోకి జారుతుంది. దీంతో నిరంతరం చికాకు, దగ్గు, గొంతు సవరించడం, గొంతు గరగర వంటి లక్షణాలు ప్రేరేపించబడతాయి. అలాగే వసంత కాలంలో ఉష్ణోగ్రతలు మారుతుంటాయి. పొడి గాలులు, ధూళి పెరుగుతాయి. కాలుష్యం ఎక్కువ అవుతుంది. ఇవి గొంతు ఎండిపోవడానికి కారణమవుతాయి. వీటితో పాటు ఇండోర్ వాతావరణాలు కూడా ఈ సమస్యకు దోహదం చేస్తాయి. ఏసీ గదుల్లో తేమ తగ్గిపోవడం వల్ల గొంతు, ముక్కు ఎండిపోతాయి. ఇంట్లోని పొడి గాలి శ్వాసకోశ మార్గానికి చికాకును కలిగించి అలెర్జీలు ఉన్న వారిలో లక్షణాలు మరింత తీవ్రతరం అవుతాయి.

ఇలా చేయండి..

పొడిగొంతు సమస్యతో బాధపడే వారికి ఉపశమనం కలిగించే కొన్ని సులభమైన నివారణలను కూడా వైద్యులు సూచిస్తున్నారు. రోజంతా ఎక్కువ నీరు తాగాలి. నీరు తాగడం వల్ల గొంతు తడిగా ఉండి శ్లేష్మం పలుచన అవ్వడానికి సహాయ పడుతుంది. వేడి ద్రవాలు కూడా ఉపశమనాన్ని కలిగిస్తాయి. హెర్బల్ టీ, సూప్, తేనె కలిపిన గోరువెచ్చని నీరు వంటి ద్రవాలు చికాకును తగ్గిస్తాయి. ఇవి గొంతును సాంత్వనపరుస్తాయి. అలాగే ఉప్పునీటితో గార్గిల్ చేయడం కూడా మంచి ఫలితాన్ని ఇస్తుంది. ఇలా చేయడం వల్ల గొంతులో వాపుతో పాటు చికాకు కూడా తగ్గుతుంది. వీటితో పాటు హ్యూమిడిఫైయర్ వాడడం అలవాటు చేసుకోవాలి. దీనిని వాడడం వల్ల గదిలో తేమ పెరుగుతుంది. శ్వాస తీసుకోవడం సులభం అవుతుంది. ఇవే కాకుండా అలర్జీ కారకాలకు గురి కావడాన్ని కూడా తగ్గించుకోవాలి. పుప్పొడి ఎక్కువగా ఉన్న రోజుల్లో కిటికీలు మూసి ఉంచుకోవాలి. బయట నుంచి వచ్చాక స్నానం చేయాలి. అవసరమైతే ఎయిర్ ప్యూరిఫైయర్ ను వాడాలి. అలాగే చికాకు కలిగించే వాటిని నివారించాలి. పొగ త్రాగడం, ఎక్కువగా కాఫీ తాగడం మానుకోవాలి.

2 వారాలకు మించితే..

అలెర్జీ లేదా సీజనల్ పొడిదనం వల్ల వచ్చే గొంతు సమస్యలు కొన్ని రోజుల్లో లేదా వారాల్లో తగ్గిపోతాయి. అయితే లక్షణాలు తగ్గకుండా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. గొంతులో చికాకు 2 వారాలకంటే ఎక్కువ కొనసాగడం, జ్వరం, తీవ్రమైన నొప్పి ఉంటే లేదా మింగడం కష్టంగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వసంత కాలంలో గొంతు ఎండిపోవడం సాధారణమే. ఇది ఎక్కువగా పుప్పొడి అలర్జీలు, పోస్ట్-నాసల్ డ్రిప్, కాలుష్యం, పొడి గాలి వల్ల వస్తుంది. అయితే సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యను సులభంగా నియంత్రించవచ్చునని, కొద్దిపాటి జాగ్రత్తలతో వసంత కాలాన్ని ఆరోగ్యంగా ఆనందించవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

# రెండు వారాల్లో రబీ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు...

రాష్ట్ర వ్యాప్తంగా అదనపు గోదాములను

వెంటనే గుర్తించి సిద్ధం చేయండి...

జిల్లా కలెక్టర్లను ఆదేశించిన పౌరసరఫరాల

శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర...



హైదరాబాద్//మార్చి 21 (ఆకాంక్ష) : రానున్న రెండు వారాల్లో రబీ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ముమ్మర ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించడమే లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. పౌరసరఫరాల భవన్‌లో రాష్ట్ర రైస్ మిల్లర్లతో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మిల్లర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించనున్న మరిన్ని కనుగొనండి విద్యా రుణ సేవలు ప్రాంతీయ వంటకాల రెసిపీ పుస్తకాలు తెలంగాణ సంస్కృతిపై డాక్యుమెంటరీలు నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అదనపు గోదాములను వెంటనే గుర్తించి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రవాణా ఏర్పాటు, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ధాన్యం అన్‌లోడ్ చేయడంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా, అన్ని కొనుగోలు కేంద్రాల్లో తగినంత మంది హమాలీలను (కార్మికులను) ఏర్పాటు చేయాలని అధికారులు, మిల్లర్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వంతో కలిసి సమన్వయంతో పని చేస్తామని రైస్ మిల్లర్లు అంగీకరించారు.

### చర్చలు, దౌత్యమార్గాల్లోనే

# సంక్షోభాలను పరిష్కరించుకోవాలి...

ఇరాన్ అధ్యక్షుడికి సూచించిన చర్యలను ప్రధాని మోదీ...



న్యూఢిల్లీ//మార్చి 21 (ఆకాంక్ష) : పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా రంజాన్ పర్షియన్ నూతన సంవత్స నౌరుజ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పర్వదినాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం తీసుకువస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు, ప్రపంచ సరఫరా గొలుసుకు ఆటంకం కలిగించే కీలక మౌలిక సదుపాయాలపై దాడులను ప్రధాని ఖండించారు. నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగాలని, నౌకామార్గాలు తెరచి ఉంచడం, వాటిని సురక్షితంగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇరాన్‌లోని భారతీయుల రక్షణకు ఆ దేశం తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ ప్రశంసించారు. యుద్ధం మొదలైన తర్వాత ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడటం ఇది రెండోసారి అని చెప్పారు. మార్చి 12న ఓసారి ఫోన్‌లో సంభాషించిన ప్రధాని.. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంపై ఆందోళన వ్యక్తంచేశారు. చర్చలు, దౌత్యమార్గాల్లోనే సంక్షోభాలను పరిష్కరించుకోవాలని ఇరాన్ అధ్యక్షుడికి సూచించారు. అనంతరం సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఖతార్, కువైట్, జోర్డాన్, మలేసియా, ఫ్రాన్స్ దేశాల అధినేతలతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై వారితో చర్చించారు.

### తమ శతృదేశాలకు సహకరించే దేశాల్లోని

# పర్యాటక కేంద్రాలపై దాడులు చేస్తాం....

ఇరాన్ హెచ్చరిక...



న్యూఢిల్లీ//మార్చి 21 (ఆకాంక్ష) : తమ శతృదేశాలతోపాటు, అమెరికా, ఇజ్రాయెల్‌కు సహకరించే దేశాల్లోని పర్యాటక కేంద్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఆయా దేశాల్లోని రిక్రియేషనల్ పార్కులు, ఇతర టూరిస్ట్ డెస్టినేషన్స్ లక్ష్యంగా చేసుకుంటామని తెలిపింది. ఈ మేరకు ఇరాన్ సైనిక అధికారి జనలర్ అబోల్ఫాజి షెకార్చి హెచ్చరించారు. అంటే, ఇకపై వైమానిక దాడులే కాకుండా తీవ్రవాద దాడులకు కూడా పాల్పడుతుందా అనే అనుమానాలు మొదలయ్యాయి. ఇదే సమయంలో ఇరాన్‌లోని నంటాజ్ అణుకేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్-అమెరికా సైన్యం దాడులకు పాల్పడింది. నంటాజ్ అణుకేంద్రంపై శనివారం ఉదయం మిస్సైళ్లతో ఇజ్రాయెల్ దాడి చేసింది. అయితే, ఈ దాడుల్లో అణుకేంద్రానికి ఎలాంటి నష్టం జరగలేదని ఇరాన్ ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి లీకేజీ, రేడియేషన్ లేదని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఇరాన్‌కు నంటాజ్ అణుకేంద్రం చాలా కీలకం. ఈ అణుకేంద్రంపై ఇజ్రాయెల్ దాడి చేయడం ఇది రెండోసారి. యుద్ధం ప్రారంభమైన తొలి వారంలోనే ఈ కేంద్రంపై దాడి జరిగింది. అప్పుడు సమీపంలోని కొన్ని బిల్డింగులు ధ్వంసమయ్యాయి. అయితే, అప్పుడు కూడా ఎలాంటి రేడియోధార్మికత విడుదల కావడం లేదని ఇరాన్ సహా ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఈ అణుకేంద్రం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 220 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గత ఏడాది జూన్‌లో జరిగిన వైమానిక దాడుల సందర్భంగా కూడా ఇజ్రాయెల్ ఈ కేంద్రంపై దాడికి పాల్పడింది. ఇరాన్‌పై దాడిని త్వరలోనే ముగిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఈ దాడి జరగడం విశేషం. ఇరాన్ యుద్ధం ప్రారంభమై నాలుగు వారాలకు చేరింది. ఇరాన్‌పై దాడి చేసేందుకు ట్రంప్ దాదాపు 3,000 మంది మెరైన్ సైనికుల్ని మోహరిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇరాన్.. గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తోంది.

## జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు....

రోడ్డు ప్రమాదాలు జరగకుండా అలైవ్ అరైవ్ కార్యక్రమం...



మంచిర్యాల//మార్చి 21 (ఆకాంక్ష) :జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు లో భాగంగా రోడ్డు ప్రమాదంలో జరగకుండా అలైవ్ అరైవ్ కార్యక్రమాన్ని శనివారం లక్షిట్టిపేట సిఐ రమణమూర్తి ఆదేశాల మేరకు జన్నారం మండల కేంద్రం బస్టాండ్ సమీపంలో వాహనదారులుతో ప్రోగ్రాన్ని పోలిసులు నిర్వహించారు. పోలీసులు మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలను నడిపే సమయంలో ప్రమాదాలకు జరగకుండా వాహనదారులు ఆరోగ్యం ఉండడానికి ప్రోగ్రాం నిర్వహించడం జరిగిందని తెలిపారు. రోడ్డుపై వెళ్లే సమయంలో టూ వీలర్ వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ డ్రైవర్ తప్పనిసరిగా సీట్ బెల్ట్ వేసుకోవాలని వాహనదారులకు పలు జాగ్రత్తలు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన్నారం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ లింగన్న, దేవన్న, సురేష్, వాహదారులు, ప్రజలు పాల్గోన్నారు.

### కేరళలో మరోసారి షిగెల్లా కలకలం

# 12మందికి పాజిటివ్- ఒక చిన్నారి మృతి!

షిగెల్లా కేసులు పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన- తాజాగా 12 మందికి వైరస్ సోకినట్టు

వెల్లడి- ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ అప్రమత్తం- నివారణ చర్యలు ముమ్మరం

కేరళలోని కోజికోడ్ జిల్లాలో షిగెల్లా వ్యాధి కలకలం రేపుతోంది. పెరువయల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎరంజికల్ ప్రాంతంలో తాజాగా మరో 12 మందికి షిగెల్లా సోకినట్లు నిర్ధరణ కావడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే కొద్ది రోజుల క్రితం నలుగురికి ఈ వ్యాధి నిర్ధరణ కాగా, వారిలో ఒక చిన్నారి మృతి చెందడం పరిస్థితిని మరింత తీవ్రమయ్యేలా చేసింది. తాజాగా నమోదైన కేసులతో మొత్తం బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం, కొత్తగా పాజిటివ్ వచ్చిన వారిలో చాలా మంది ఇప్పటికే బాధితులైన వారి కుటుంబ సభ్యులే. దీంతో వ్యాధి ఒకే ప్రాంతంలో వేగంగా వ్యాప్తి చెందుతున్నట్టు అధికారులు భావిస్తున్నారు. ఇదే నేపథ్యంలో ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ యంత్రాంగం అప్రమత్తమై విస్తృత స్థాయిలో నివారణ చర్యలు చేపట్టింది. ఎరంజికల్, పూవట్టుపరంబ ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు మెడికల్ టీంలు ఇంటింటికీ వెళ్లి పరిశీలనలు నిర్వహిస్తున్నాయి. లక్షణాలు కనిపిస్తున్న వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మరికొంతమంది అనుమానితులను ఆసుపత్రుల్లో చేర్చి, వారి నమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో ఇంటింటికీ బావుల క్లోరినేషన్ కార్యక్రమం చేపట్టారు. తాగునీటి వనరులను శుభ్రపరిచే పనులు వేగవంతం చేశారు. అదనంగా, ఆహార భద్రతా శాఖ అధికారులు రంగంలోకి దిగారు. పరిశుభ్రత లేని పరిస్థితుల్లో పనిచేస్తున్న మూడు ఆహార దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన ఆహారం, తాగునీరు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితిపై పెరువయల్ గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఆర్‌వీ జాఫర్ స్పందిస్తూ, షిగెల్లా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసర సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈద్ రోజున కూడా ఆరోగ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి సమావేశమై చర్యలను సమీక్షించినట్టు చెప్పారు. పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో కూడా క్లోరినేషన్ పూర్తి చేసినట్టు వెల్లడించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై వివరాలు అందిస్తున్నారు. జ్వరము, విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

తొలి ఆకాంక్ష



### ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో

# లోపాల మీద లోపాలు...

లెక్చరర్లు పిల్లల్లా గుంపులు గుంపులుగా కూర్చుని పేపర్లు మూ ల్యాంకనం...



హైదరాబాద్//**మార్చి 21 (ఆకాంక్ష)** :ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో లోపాల మీద లోపాలు వెలుగు చూస్తున్నాయి. లెక్చరర్లు పిల్లల్లా గుంపులు గుంపులుగా కూర్చుని పేపర్లు మూ ల్యాంకనం చేస్తున్నారు. ఇంటర్ పరీక్షలు ముగియడం తో జవాబుపత్రాల మూల్యాంకనం కొనసాగుతున్న ది. పలు జిల్లాల్లో మూల్యాంకన క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపుల్లో సరైన వసతుల్లేవు. కనీసం కూర్చునేందుకు బెంచీలు(డ్యూయల్ డెస్క్) కూడా లేవు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మూల్యాంకన క్యాంపులో లెక్చరర్లు అంతా నేలమీదే కూర్చుని పేపర్లు దిద్దుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొందరు లెక్చరర్లు కారిడార్, బాల్కనీల్లో గోడల మీద పేపర్లు పెట్టి మూల్యాంకనం చేస్తున్న చిత్రాలు సోషల్‌మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. శుక్రవారం కీలకమైన బాటనీ, జువాలజీ, కామర్స్ పేపర్లు వాల్యుయేషన్ చేయించగా అనేక లోపాలు వెలుగుచూశాయి.జవాబు పత్రాల మూల్యాంకనం గందరగోళంగా సాగుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుతో అధికారులు ఆటలు ఆడుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. హడావుడిగా వాల్యుయేషన్ చేయిస్తున్నారని, విచ్చలవిడితనానికి పరాకాష్టగా మారిందని అంటున్నారు. ఈ నెల 17 నుంచి అన్ని క్యాంపుల్లో 30 పేపర్లకు బదులు రోజుకు 45 పేపర్లు ఇస్తున్నారని మండిపడుతున్నారు.మూల్యాంకన కేంద్రాల్లో వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని లెక్చరర్లు ఆరోపిస్తున్నారు. ఈ రోజు ఎంత మంది వస్తారు.. ఎన్ని బెంచీలు, కుర్చీలు అవసరమన్న అంశాలు పరిగణనలోకి తీసుకోకుండా ఏర్పాట్లు చేశారని చెప్తున్నారు. వసతులు సరిగ్గా లేకపోతే లెక్చరర్లు పేపర్లను సక్రమంగా మూల్యాంకనం చేయకపోతే దీని ప్రభావం ఫలితాల మీద పడుతుంది. పకడ్బందీగా పేపర్ల మూల్యాంకనం అంటే ఇదేనా.. అని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. విద్యార్థులు ఫెయిలైతే.. బాధ్యులెవరు అని నిలదీస్తున్నాయి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం గర్హనీయమని మండిపడుతున్నాయి. అధికారులు చొరవ తీసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

## చిన్న పిల్లల ఆటల్లాగా ఉందా.. రేవంత్ రెడ్డికి...

చిన్నప్పటినుండి సరైన గురువు లేడేమో.. మూసీ బాధితురాలు...




హైదరాబాద్//**మార్చి 21 (ఆకాంక్ష)** : కాంగ్రెస్ సర్కారు మూసీ సుందరీకరణ పేరుతో చేస్తున్న దౌర్జన్యంపై మూసీ బాధితుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తాము ఎంతో కష్టపడి కట్టుకున్న ఇంటిని తొలిగిస్తామంటే ఊరుకునే లేదని స్పష్టం చ్చున్నారు. పిల్లలకు ఏం చెప్పాలో అర్థం కావడం లేదంటూ ఓ తల్లి కన్నీరు మున్నీరైంది.మూసీ బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ.. అమ్మ రేపు మన ఇల్లు కూలగొడుతున్నారట కదా.. ఏంటీ మన పరిస్థితి అని అడుగుతుంటే.. ఏం చెప్పాలో అర్థం కావట్లేదు. నేను ఒకరికి ధైర్యం చెప్పాల్సింది పోయి.. నేను ధైర్యం కోల్పోతున్నాను. నాలాంటి పరిస్థితి ఎదుర్కోకండి. తల్లి తర్వాత ఇంకో తల్లిని తీసుకొస్తాను.. నష్టపరిహారం ఇస్తాను అంటే ఒప్పుకుంటారా.. ఈ తల్లి వద్దు నీకు వేరే తల్లిని తీసుకొస్తానంటే ఒప్పుకుంటారా..? కాదు కదా.. ఇది మా ఇల్లు.. కష్టపడి కట్టుకున్న ఇల్లు. డ్రీమ్ హౌస్ అని అంటం. దయచేసి మా కలను చెదర్చకండి.. మాకో విలువ ఉంది.. మమ్మల్ని గుర్తించండి.. ప్రతీ ఒక్కరికి చెప్పేదేంటంటే మమ్మల్ని కూడా ఇక్కడ ఉండనీయండి. ఎలాంటి నష్ట పరిహారం మాకొద్దు. ఇచ్చినా ఏవిధంగా ఇస్తరు..ఝ మా ఇంటిలో మేం ప్రశాంతంగా ఉండానుకుంటున్నాం.. మా జీవితాలతో గేమ్స్ ఆడకండి.. మీకు గేమ్స్ ఇష్టమేమో వేరే విధంగా ఆడుకోండి. దయ చేసి మా జీవితాలు కాపాడండి అంటూఓ మహిళ కన్నీరుమున్నీరైంది.రేవంత్ రెడ్డికి చిన్నప్పటినుండి సరైన గురువు లేడేమో అందుకే ఇలా చేస్తున్నాడు, మా దగ్గరికి రండి మా పిల్లలు చదువు చెప్తారని మండిపడ్డది. ఇలాంటి పనులు చేస్తే మా వాల్యూ కాదు రేవంత్ రెడ్డి వాల్యూ జీరో అవుతుంది. మీ తల్లిని తీసుకెళ్లి ఇంకొక తల్లిని ఇస్తామంటే ఊరుకుంటారా? మా ఇల్లు కూడా మాకు తల్లితో సమానమే.. దయచేసి మా జీవితాలతో ఆడుకోకండి ఇదేమన్న చాక్లెట్ ఆ లేక బిస్కెట్ ఆ అడగగానే ఇవ్వడానికి..కష్టపడి కట్టుకున్న ఇల్లు అని హెచ్చరించింది.ఒకరు వచ్చి హైదరాబాద్ సింగపూర్ చేస్తా అంటారు.. ఇంకొకరు మీ ఇల్లు కూలగొట్టి సుందరీకరణ చేస్తా అంటారు.. చిన్న పిల్లల ఆటల్లాగా ఉందా రేవంత్ రెడ్డి తెలంగాణ ఎకానమీ పెంచుతా అనడం పెద్ద జోక్ లాగా ఉంది, ఆయనకు ఎప్పుడూ ఆయన ఎకానమీ పెంచుకోవడం మీదనే ధ్యాస ఉందంటూ సదరు మూసీ బాధితురాలు తీవ్ర స్థాయిలో ఆరోపించింది.

### ప్రాధాన్యం లేనప్పుడు పార్టీలో

## ఉండటం ఎందుకు...జీవన్ రెడ్డి

జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి బుజ్జగించిన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్...



హైదరాబాద్//**మార్చి 21 (ఆకాంక్ష)** : కాంగ్రెస్ పై అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బిఆర్ఎస్ లోకి జీవన్ రెడ్డి వెళ్తారంటూ ప్రచారం చేశారు. జీవన్ రెడ్డి ఇంటికి మంత్రి శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ వచ్చారు. జీవన్ రెడ్డిని శ్రీధర్ బాబు బుజ్జగించారు. జీవన్ రెడ్డితో గంటకు పైగా మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డిని కలవడానికి వచ్చామని, జీవన్ రెడ్డితో అనేక అంశాల గురించి చర్చించామని తెలిపారు. జీవన్ రెడ్డి పద్ధతిగల నాయకుడిగా 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని కొనియాడారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల మనోభావాలను తెలియజేశారు. జీవన్ రెడ్డి ఆవేదనను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంత్రులతో సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ మార్పుపై పట్టు వీడలేదని, ప్రాధాన్యం లేనప్పుడు పార్టీలో ఉండటం ఎందుకని ప్రశ్నించారు. మంత్రులు పార్టీలో కొనసాగాలని కోరారు. మీకో దండం అంటూ మంత్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవన్ రెడ్డి ససేమిరా అని..తన నిర్ణయం లో మార్పులేదని, పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని జీవన్ రెడ్డి అన్నారు.

### రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు

## డీసీపీ బి. రామ్ రెడ్డి శుభాకాంక్షలు...



గోదావరిఖని//**మార్చి 21 (ఆకాంక్ష)** : రంజాన్ పండుగ సందర్భంగా పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 5 ఇంక్లైన్ వద్ద ఉన్న ఈద్గాను శనివారం ఆయన సందర్శించి, పండుగ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులను కలిసి డీసీపీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం శాంతి, సహనం, దయ, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో ప్రశాంత, శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఉపవాస దీక్షలు మనుషుల్లో సేవాభావం, ఆత్మపరిశీలన, నియంత్రణను పెంపొందిస్తాయని పేర్కొన్న డీసీపీ, రంజాన్ పర్వదినాన్ని శాంతి యుతంగా జరుపుకునేలా పోలీస్ శాఖ తరపున అన్ని విధాలుగా బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పరస్పరం సహకరించుకొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# వేలం లేకుండా బొగ్గు గనులు సింగరేణికే కేటాయించాలి...

గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కార్మిక హక్కుల పరిరక్షణలో విఫలం...

సింగరేణి పరిరక్షణకు కార్మిక వర్గం ఏకం కావాలి...టీఎన్‌టీయూసీ



గోదావరిఖనిటౌన్//**మార్చి 21 (ఆకాంక్ష)** : సింగరేణి సంస్థలోని బొగ్గు బ్లాకులను వేలం పాటలకు పెట్టకుండా నేరుగా సింగరేణి సంస్థకే కేటాయించాలని టీఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాపాడడంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని, సింగరేణి సంస్థను పరిరక్షించేందుకు కార్మిక వర్గం అంతా ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.శనివారం గోదావరిఖనిలో నిర్వహించిన టీఎన్‌టీయూసీ సమావేశంలో సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ జనరల్ సెక్రటరీ టి. మణిరామ్ సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనుల కార్మికోద్యమానికి 126 ఏళ్ల పోరాట చరిత్ర ఉందన్నారు. ఎన్నో ఉద్యమాలు, త్యాగాల ఫలితంగానే నేడు సింగరేణి కార్మికులు అనుభవిస్తున్న హక్కులు, సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు.అయితే ప్రస్తుతం అమలవుతున్న సంస్కరణల పేరుతో సింగరేణిలో ఉన్న ఉద్యోగాలు తగ్గిపోతున్నాయని, ఉపాధి కల్పించే భూగర్భ గనుల స్థానంలో ఓపెన్‌కాస్ట్ గనులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు చెమటోడ్చి హక్కుల కోసం పోరాడిన గని కార్మిక వర్గం నేడు బలహీనపడిందని, హక్కుల కోసం గొంతెత్తే స్వరాలను అణచివేస్తున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. సస్పెన్షన్లు, చార్జ్‌షీట్లు నిత్యకృత్యాలుగా మారిపోయాయని అన్నారు.కార్మికుల తరపున ముందుండాల్సిన జాతీయ కార్మిక సంఘాలు యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని, పోరాడే సంఘాలకు ఇప్పటి కమర్షియల్ ధోరణి కలిగిన కార్మిక వర్గం ఆశించిన మద్దతు ఇవ్వడం లేదని తెలిపారు. కార్మిక ఉద్యమం కేవలం ఆర్థిక డిమాండ్లకే పరిమితం కాకుండా, దేశ వ్యాప్తంగా అమలవుతున్న కార్మిక వ్యతిరేక పారిశ్రామిక విధానాలపై కూడా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ విషయంలో జాతీయ కార్మిక సంఘాలు చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు.దేశవ్యాప్తంగా పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు అప్పగించే దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తున్నప్పటికీ, జాతీయ కార్మిక సంఘాలు నామమాత్రపు బంద్ పిలుపులతో చేతులు దులుపుకుంటున్నాయని విమర్శించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలుగా ఉన్న సంస్థలు సింగరేణిలోనూ విధానపరమైన ఉద్యమాలను నిర్మించడంలో విఫలమయ్యాయని, ప్రైవేటీకరణ నుంచి ఒక్క జాతీయ పరిశ్రమనైనా కాపాడలేక పోయాయని అన్నారు.సింగరేణి బొగ్గు గనుల వేలం, ఎంఎండీఆర్ విధానాలను అడ్డుకోలేక పాలకపక్షాలు, గుర్తింపు సంఘాలు పరిస్థితిని బట్టి మాట్లాడుతున్నాయని, సింగరేణిలో అడుగడుగునా పెరుగుతున్న ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్ సోర్సింగ్‌ను అడ్డుకోవడంలో అవి విఫలమయ్యాయని పేర్కొన్నారు. గతంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ వంటి సంఘాలు గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన తర్వాత కేంద్రం ప్రవేశపెట్టిన బొగ్గు బ్లాకుల వేలం పాటల్లో రాష్ట్ర ప్రభుత్వం పాల్గొనాలని చెప్పడం ద్వారా వాటి అసలు స్వరూపం కార్మిక వర్గానికి బహిర్గతమైందని విమర్శించారు. ఇకపై కార్మిక వర్గం అలాంటి సంఘాలను నమ్మే పరిస్థితుల్లో లేదన్నారు.సింగరేణిలోని బొగ్గు బ్లాకులను వేలం పాటలకు అతీతంగా నేరుగా సింగరేణికే కేటాయించాలని టి. మణిరామ్ సింగ్, నిమ్మకాయల ఏడుకొండలు డిమాండ్ చేశారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలంలో పాల్గొనకపోతే, రాష్ట్రానికి చెందిన ఈ బొగ్గు బ్లాకులను రక్షించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చొరవ చూపాలని కోరారు. అదే విధంగా సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను కూడా పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని జీఎం కార్యాలయాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ముదిగంటి దామోదర్ రెడ్డి, సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ టీఎన్‌టీయూసీ కోశాధికారి పెగడపల్లి రాజనర్సు, కొండి శ్రీనివాస్, బెఖ్యం వీరేందర్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, సుందిళ్ల స్వామి, టౌన్ ఎస్సీ సెల్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

### మిర్యాలగూడలో రంజాన్ శుభాకాంక్షలు

## తెలిపిన నల్లమోతు సిద్దార్థ...



మిర్యాలగూడ//**మార్చి 21 (ఆకాంక్ష)** : బీఆర్ఎస్ పార్టీతోనే మైనారిటీల సంక్షేమం సాధ్యమవుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎన్బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ ఈద్గా, అవంతీపురం ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో నల్లమోతు సిద్దార్థ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవంతీపురం ఈద్గా అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం అవసరమైన నిధులను మంజూరు చేసిందన్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేసిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని ఆయన పునరుద్ఘాటించారు.మిర్యాలగూడ నియోజకవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని సిద్దార్థ పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం శాంతి, ప్రేమ, దయ,సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే ఈ పవిత్ర పర్వదినం సమాజంలో ఐక్యతా భావాన్ని మరింత బలపరుస్తుందని అన్నారు. తెలంగాణలో గంగా-జమునా తహజీబ్‌కు రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తోందని వ్యాఖ్యానించారు.మైనారిటీల సంక్షేమం కోసం కేసీఆర్ సర్కార్ అమలు చేసిన పలు పథకాలు ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపాయని, వాటి ఫలితాలు నేటికీ కనిపిస్తున్నాయని నల్లమోతు సిద్దార్థ తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలంతా భక్తి, శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ డిఫెండర్, నల్లగొండ జిల్లా సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ హమీద్ షేక్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మగ్దూం పాషా, కౌన్సిలర్ మొహమ్మద్ ఇలియాజ్, సాధినేని శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి షోయబ్, ఫణి కుమార్, సలీం, గయాజ్, శ్రవణ్, జానీ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణే పరమధర్మం



**మార్చి 21 (ఆకాంక్ష)** : ప్రపంచ కవిత్వ దినోత్సవం వృక్షరాజుల వక్షస్థలమున్ వాయువు విహరించు వేళ, మంజుల మానస సారమై పత్తిపాటి పలుకు పరిమళించె; ప్రకృతి పరిరక్షణే పరమధర్మం ప్రపంచ కవిత్వ దినోత్సవానికి స్వాగతం పలుకుదాం రండీవ నీలాంబర తలపాగ మిద నక్షత్ర హారముల కాంతి, మంజుల కవిత్వ దీప్తిగా పత్తిపాటి భావ రేఖలై మెరిసె; భూమాత వేదన వినిపించున్ ప్రపంచ కవిత్వ దినోత్సవానికి స్వాగతం పలుకుదాం రండీవ సరిత్సాగర గర్భమున్ సంరక్షణ స్వరమెల్ల వినిపించగా, మంజుల హృదయ తంత్రులపై పత్తిపాటి రాగమాల విరిసె; జలమే జీవన మూలమని ప్రపంచ కవిత్వ దినోత్సవానికి స్వాగతం పలుకుదాం రండీవ పుష్పిత వనరాజుల లోకమున్ పక్షి గానామృతమెల్ల పారగా, మంజుల సుగుణ సాన్నిధ్యమై పత్తిపాటి పద్య కుసుమముల విరిసె; ప్రకృతి లాలనలోనే శాంతి ప్రపంచ కవిత్వ దినోత్సవానికి స్వాగతం పలుకుదాం రండీవ భూమండల మాతృమూర్తి బాధతో మౌనమై నిలిచిన వేళ, మంజుల కరుణారస గంభీరమై పత్తిపాటి వాక్యామృతమై పొంగె; మనసారా కాపాడుదాం భూదేవిని ప్రపంచ కవిత్వ దినోత్సవానికి స్వాగతం పలుకుదాం రండీవ రచన: మంజుల పత్తిపాటి చరవాణి 9347042218 యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ రాష్ట్రం.

## భార్య చనిపోయిందనే వేదనతో ఎస్సై బలవన్మరణం...

ఎస్సై దంపతుల మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలు...



జమ్మికుంట//**మార్చి 21 (ఆకాంక్ష)** : కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలో విషాద ఘటన చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై చంద్రశేఖర్ యాదవ్, జమ్మికుంట మండలం సీతంపేటలోని తన అత్తగారింట్లో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపింది.కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 17న ఎస్సై చంద్రశేఖర్ యాదవ్ భార్య దివ్య కడుపునొప్పి భరించలేక గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. భార్య మృతితో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్ యాదవ్, ఈరోజు అదే వేదనను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.వరుసగా దంపతుల మరణాలతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనతో ఇద్దరు చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలి పోవడం స్థానికులను కలచివేసింది. ఒకే కుటుంబంలో తక్కువ వ్యవధిలో జరిగిన ఈ వరుస మరణాలు జమ్మికుంట మండల ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.ఈ దారుణ ఘటనపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కుటుంబ పరిస్థితి, వరుస మరణాల వెనుక ఉన్న కారణాలపై అన్ని కోణాల్లో విచారణ జరిపి నిజానిజాలు వెలికి తీయాలని కోరుతున్నారు.

### రాజన్న సిరిసిల్ల జిల్లాలో

## పోలీస్ అధికారులతో ఐజీపీ సమీక్ష...

శాంతిభద్రతలు, దర్యాప్తు నాణ్యత, కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి...

సిరిసిల్ల//**మార్చి 21 (ఆకాంక్ష)** : రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితులు,కేసుల దర్యాప్తు నాణ్యత, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర అంశాలపై మల్టీ జోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాకు విచ్చేసిన ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డికి జిల్లా పోలీస్ అధికారులు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాలచే గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సర్కిల్ వారీగా శాంతిభద్రతల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు భద్రతాభావం కలిగేలా పోలీస్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది చట్టాలపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని ఐజీపీ స్పష్టం చేశారు. నమోదు అయిన కేసుల్లో దర్యాప్తు నాణ్యతను మెరుగుపరుస్తూ, ప్రజలకు వేగవంతమైన న్యాయం అందేలా పోలీస్ యంత్రాంగం మరింత సమర్థంగా పనిచేయాలని ఆదేశించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో 5ఎస్ విధానంలో రికార్డుల నిర్వహణను సక్రమంగా ఉంచాలని సూచించారు.జిల్లాలో ప్రోయాక్టివ్, విజిబుల్, కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిఘాను మరింత కఠినతరం చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల భద్రతే పోలీస్ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని, ఇంటి నుంచి బయలుదేరిన ప్రతి వ్యక్తి సురక్షితంగా తిరిగి ఇంటికి చేరాలనే ఉద్దేశంతో చేపట్టిన “అరైవ్ అలైవ్” కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఐజీపీ పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, వెంకటేశ్వర్లు, రవి, ఆర్ఐలు మధుకర్, రమేష్, యాదగిరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై

## మార్చి 23న అసెంబ్లీ ముట్టడి...




హైదరాబాద్//**మార్చి 21 (ఆకాంక్ష)** : రాష్ట్ర ప్రజలను అడుగడుగునా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల ముందే నిలదీయాలని, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మార్చి 23న బీజేపీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రస్థాయిలో విమర్శించారు.రాష్ట్రంలో నిరుద్యోగులు, యువత, మహిళలు, రైతులు, విద్యార్థులు, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం వాటిపై స్పష్టమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని అన్నారు. అవినీతి, నిర్వీర్యమైన పాలన, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వల్ల తెలంగాణ సంక్షోభ పరిస్థితుల్లోకి నెట్టబడిందని పేర్కొన్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సారథ్యంలో చేపడుతున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బాధ్యత వహించేలా చేస్తామని తూళ్ల వీరేందర్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా బాధిత వర్గాలంతా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి నిరాశకు గురిచేసిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇళ్లు వస్తాయని ఆశించిన పేదలకు న్యాయం జరగలేదని, పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు మోసపోయామని భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రైతు భరోసా అమలు విషయంలో కూడా ప్రభుత్వం వైఫల్యం చవిచూసిందని విమర్శించారు. అందువల్ల ఈ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి ఒక సామూహిక వేదికగా నిలవాలని అన్నారు.తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలు రోడ్లపైకి వచ్చి పోరాడినట్లే, ఇప్పుడు కూడా ప్రజలే ముందుకు వస్తేనే మార్పు సాధ్యమవుతుందని తూళ్ల వీరేందర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా తప్పించుకునే రాజకీయాలకు ఇక స్థానం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులను ప్రజల ముందే నిలబెట్టి సమాధానం కోరాల్సిన సమయం వచ్చిందన్నారు. హైదరాబాద్ మాత్రమే కాకుండా తెలంగాణలోని ప్రతి గ్రామం, ప్రతి నియోజకవర్గంలో ప్రజల ప్రశ్నలకు కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి తీసుకురావాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ‘డబ్బులు లేవు’ అనే మాట మాత్రమే వినిపిస్తోందని, గత ప్రభుత్వాలు మరియు ప్రస్తుత ప్రభుత్వం కలిపి తెలంగాణను ఆర్థిక, పరిపాలనా దుస్థితిలోకి నెట్టాయని విమర్శించారు.మార్చి 23న నిర్వహించే అసెంబ్లీ ముట్టడిలో నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులు, నిరుపేదలు పెద్ద ఎత్తున పాల్గొని తమ గళం వినిపించాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రజల ఆశలు, ఆవేదన, ఆగ్రహానికి ఈ కార్యక్రమం ప్రతీకగా నిలవాలని అన్నారు.ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాషా, రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సోదరభావానికి ప్రతీకగా రంజాన్ వేడుకలు...



పెద్దపల్లి//**మార్చి 21 (ఆకాంక్ష)** : పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి ప్రాంతంలో ఉన్న ఈద్గా వద్ద శనివారం పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష ఈద్గాను సందర్శించి, ప్రత్యేక ప్రార్థనలు ముగించుకున్న ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ రంజాన్ పండుగ క్రమశిక్షణ, దాతృత్వం, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టి, లోక కల్యాణం కోసం ప్రార్థనలు చేయడం గొప్ప ఆధ్యాత్మికతకు నిదర్శనమని పేర్కొన్నారు. గంగా-జమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలిచిన మన ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసి పండుగలు జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు.జిల్లా ప్రజలందరి జీవితాల్లో ఈ రంజాన్ పర్వదినం సుఖ సంతోషాలు, శాంతి, సమృద్ధి నింపాలని ఆమె ఆకాంక్షించారు.మత భేదాలు లేకుండా పరస్పర గౌరవం, ప్రేమాభిమానాలతో జీవించడం సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు అలువాల రాజేందర్, ఎండి. మాలిక్, బీఆర్ఎస్ నాయకులు మురుమూరి శేఖర్, గాజుల రమేష్, మెరుగు సాగర్, ఎనగందుల నిరంజన్, ఆముదాల అరుణ, మచ్చ రాహుల్, కల్వల చరణ్, అజీమ్, ఖలీల్, అబ్బు, రజనీకాంత్‌తో పాటు పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో దారుణం...

## పెళ్లి చేసుకుందన్న కక్షతో మహిళపై కత్తితో దాడి...



హైదరాబాద్//**మార్చి 21 (ఆకాంక్ష) :** తనను వివాహం చేసుకోకుండా వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కక్షతో ఓ మహిళపై ప్రియుడు, అతని తండ్రి కలిసి కత్తితో దాడి చేసిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని స్థానికులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా, పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన నూకరత్నం (25) ప్రస్తుతం మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివసిస్తూ హౌస్‌కీపింగ్ పని చేస్తోంది. గతంలోనే భర్తను కోల్పోయిన ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలం క్రితం ప్రసాద్ అనే వ్యక్తితో నూకరత్నానికి పరిచయం ఏర్పడి, పరస్పర అంగీకారంతో గత నెల ఫిబ్రవరి 20న వివాహం చేసుకున్నారు. అయితే నూకరత్నం పనిచేస్తున్న చోటే వంటవాడిగా పనిచేస్తున్న ఆలీషా అలియాస్ పాండు ఆమెను ఇష్టపడుతున్నట్లు తెలిసింది. నూకరత్నం తనకు చెప్పకుండా ప్రసాద్‌ను వివాహం చేసుకోవడంతో ఆలీషా ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల19న ఆలీషా తన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌తో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. తనతో రావాలని నూకరత్నంతో గొడవ పడగా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆలీషా వెంట తెచ్చుకున్న కత్తితో నూకరత్నంపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఆమెకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితురాలి కేకలు విని అక్కడికి చేరుకున్న స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నూకరత్నంపై దాడికి పాల్పడిన ఆలీషా, అతని తండ్రి లాలూను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. మహిళపై జరిగిన ఈ దారుణ దాడి స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగించింది. వ్యక్తిగత కక్షలు, వివాహ సంబంధ వివాదాలు హింసాత్మక ఘటనలకు దారి తీయడం ఆందోళనకరమని స్థానికులు పేర్కొంటున్నారు.



## గొర్రెల కాపరుల హక్కుల కోసం 23న

# కలెక్టరేట్ ముందు భారీ గొంగడి ధర్నా...




పెద్దపల్లి//**మార్చి 21 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లాలో గొర్రెల కాపరుల హక్కులు, ఆత్మగౌరవం, మార్కెట్ స్థలాల రక్షణ కోసం ఈ నెల 23న జిల్లా కలెక్టరేట్ ముందు భారీ స్థాయిలో గొంగడి ధర్నా నిర్వహించనున్నట్లు గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ప్రకటించింది. ఈ మేరకు శనివారం పెద్దపల్లి శాంతినగర్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ నాయకులు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, జిల్లా అధ్యక్షుడు సలేంద్ర రాములు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నరసయ్య యాదవ్ మాట్లాడుతూ, గొర్రెల కాపరుల జీవనోపాధి, మార్కెట్ స్థలాలు, సంప్రదాయ వృత్తి రక్షణ కోసం చేపడుతున్న ఈ ధర్నా చారిత్రాత్మక పోరాటంగా నిలవనుందని పేర్కొన్నారు. హక్కుల కోసం నిశ్శబ్దంగా ఉంటే భవిష్యత్తు అంధకారమవుతుందని, తమ సమస్యలను ఎవరూ వచ్చి పరిష్కరించరని, తమకోసం తామే పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 23న ఉదయం 10.30 గంటలకు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ముందు నిర్వహించే గొంగడి ధర్నాకు జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి యాదవులు, కురుమలు, గొర్రెల కాపరులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సంఘ నాయకులు పిలుపు నిచ్చారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ తమ సంప్రదాయ గుర్తింపు అయిన గొంగడి ధరించి హాజరై ఐక్యత, శక్తిని ప్రభుత్వానికి చాటి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ఒక నిరసన కార్యక్రమం మాత్రమే కాదని, రాబోయే తరాల భవిష్యత్తు, వృత్తి గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమమని వారు స్పష్టం చేశారు. అనంతరం గొంగడి ధర్నా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్ల అంజయ్య యాదవ్, మండలాధ్యక్షుడు దాడి చంద్రమౌళి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి...





నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 21 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ పట్టణంలోని నెల్లికొండ క్రాస్‌రోడ్డు వద్ద వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు, సంఘ ప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమణారావు, వైస్‌ఛైర్మన్ జంగయ్య, మున్సిపల్ ఛైర్మన్ తీగల సునేంద్ర, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జ్ గణేష్, పీఏసీఎస్ సీఈవో నరేష్, డైరెక్టర్లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఖనికి చేరనున్న సేవ్ సింగరేణి పోరు బస్సు జాత...

గోదావరిఖనిటౌన్ //**మార్చి 21 (ఆకాంక్ష) :** సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం పెరుగుతోందని ఆరోపిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన "సేవ్ సింగరేణి పోరు బస్సు జాత" ఈ నెల 22న గోదావరిఖనికి చేరుకోనుందని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మద్ది ఎల్లయ్య తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోరు జాతకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పోరు జాతలో యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కూరిమి రాజ్‌కుమార్, ఉప ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, కే.వీరభద్రం, ముష్కు సమ్మయ్య తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మిక హక్కుల సాధన, సంస్థలో రాజకీయ జోక్యాన్ని అరికట్టడం ప్రధాన లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగుతోందని తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని భాస్కర్‌రావు భవన్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ర్యాలీ మెయిన్ చౌరస్తా నుంచి ఫైవ్ ఇంక్లైన్ చౌరస్తా, విఠల్‌నగర్, తిలక్‌నగర్, రమేష్‌నగర్, ఎల్‌బీనగర్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా చౌరస్తా వరకు సాగుతుందని వివరించారు. అనంతరం చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సోదరులు, ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి ఆఫీస్ బేరర్లు, పిట్ కార్యదర్శులు, సేఫ్టీ మరియు మైన్స్ కమిటీ సభ్యులు, పిట్ కమిటీ సభ్యులు, సీపీఐ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మద్ది ఎల్లయ్య కోరారు. సింగరేణి పరిరక్షణ కోసం కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని, పోరు జాత ద్వారా సంస్థ భవిష్యత్తుపై అవగాహన కల్పించడమే ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

## వట్టెంకారుకొండ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 21 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ బిజినేపల్లి మండల పరిధిలోని వట్టెం, కారుకొండ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, లబ్ధిదారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. పేదలకు శాశ్వత నివాసం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు సామాన్య ప్రజల గౌరవాన్ని పెంచే పథకమని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో బ్రాహ్మణులకు తీవ్ర అన్యాయం...

## గ్లోబల్ బ్రాహ్మణ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆగ్రహం...




హైదరాబాద్//**మార్చి 21 (ఆకాంక్ష) :** రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్‌లో బ్రాహ్మణ వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని గ్లోబల్ బ్రాహ్మణ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గిరి ప్రసాద్ శర్మ, రుద్రవీణ బాలసుబ్రహ్మణ్యం ఆరోపించారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రాహ్మణ పరిషత్‌కు తక్షణమే రూ.5,000 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ప్రకటించిన పథకాల బకాయిలను వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని, బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు. గత ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ దానికి పూర్తి స్థాయి పరిపాలనా వ్యవస్థ కల్పించలేదని, ముఖ్యంగా ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించక పోవడం వల్ల సంస్థ పనితీరు బలహీనపడిందని విమర్శించారు. వెంటనే కార్పొరేషన్‌కు ఐఏఎస్ అధికారిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు అధికారిగా కొనసాగిన శైలజ రామయ్య బ్రాహ్మణ కార్పొరేషన్‌కు సంబంధించిన స్పష్టమైన ప్రకటన విడుదల చేయక పోవడం దురదృష్టకరమని నాయకులు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పథకాలకూ నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన మంత్రి ఉన్నప్పటికీ, ఆయన నుంచి వర్గానికి ఆశించిన స్థాయిలో మద్దతు అందలేదని విమర్శలు గుప్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల బ్రాహ్మణ కుటుంబాలు ఉన్నాయని, వారిలో పెద్ద సంఖ్యలో ప్రజలు పూజలు, పంచాంగ సేవలు వంటి సంప్రదాయ వృత్తులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇతర వర్గాలతో పోటీ పడేందుకు తగిన ఆర్థిక, విద్యా, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, నిధులు విడుదల చేసి బ్రాహ్మణ వర్గాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పేరుపై ప్రభుత్వానికి అభ్యంతరాలు ఉంటే, దానికి ప్రత్యామ్నాయంగా మరో పేరును పెట్టుకున్నా తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, కానీ సంస్థ ద్వారా లబ్ధులు ప్రజలకు చేరేలా చూడాలని స్పష్టం చేశారు. తమకు ప్రభుత్వంపై ద్వేషం ఏమీ లేదని, అయితే హామీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా అమలు దశకు రావాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణ వర్గం ఆందోళన బాట పట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పురుషోత్తంరావు, కోటేశ్వరరావు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో సఖ్యత, ఐక్యత మరింత బలపడాలి...

## రంజాన్ ప్రార్థనల్లో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్...





గోదావరిఖని//**మార్చి 21 (ఆకాంక్ష) :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గోదావరిఖని ప్రాంతంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాల్లో రామగుండం నియోజకవర్గ శాసనస భ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. శారద్‌నగర్, రామగుండం, 4 ఇంక్లైన్ ఈద్గాల వద్ద నిర్వహించిన నమాజ్ కార్యక్రమంలో ఆయన ముస్లిం సోదర సోదరీమణులతో కలిసి ప్రార్థనలు నిర్వహించి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు. ముస్లిం సమాజ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సహనం, దానం, సోదరభావం వంటి మహోన్నత విలువలను సమాజానికి నేర్పిస్తుందని పేర్కొన్నారు. సమాజంలో పరస్పర గౌరవం, సఖ్యత, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో శాంతి, సంతోషం నెలకొనాలని, ఈ పర్వదినం అందరికీ మంచి ఆరోగ్యం, అభివృద్ధి తీసుకురావాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం రామగుండం నియోజకవర్గంలో పలు చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. గోదావరిఖని షాదీఖానా కోసం 2008లో 18 గుంటల భూమి మంజూరు చేయించడంతో పాటు సుమారు రూ.46 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. అదనంగా మరో రూ.50 లక్షలు విడుదల చేయించినట్లు చెప్పారు. అలాగే రామగుండం షాదీఖానా నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ముస్లిం యువత సాధికారత కోసం ఎలక్ట్రికల్ స్కూటర్లు, స్టిచ్చింగ్ మిషన్లు పంపిణీ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణలో ఏ మునిసిపాలిటీలో లేని విధంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో 6 కార్పొరేటర్ స్థానాలు ముస్లిం సమాజానికి దక్కేలా చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రామగుండం చరిత్రలో తొలిసారిగా హజ్ కమిటీ సభ్యురాలిగా ఒక ముస్లిం మహిళకు అవకాశం కల్పించామని తెలిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, సర్వమత సౌభ్రాతృత్వం మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా కొనసాగింది.

# బొగ్గు రవాణాలో జీడీకే-1 సీహెచ్‌పీ రికార్డుల పరంపర...

## సమిష్టి కృషితో కొత్త ఒరవడి...

## అధికారుల, ఉద్యోగుల పనితీరుపై జీఎం లలిత్ కుమార్ అభినందనలు...



గోదావరిఖని//**మార్చి 21 (ఆకాంక్ష) :** సింగరేణి ఆర్జీ-1 ఏరియాకు చెందిన జీడీకే-1 సీహెచ్‌పీ బొగ్గు రవాణాలో రికార్డుల పరంపర కొనసాగిస్తూ నూతన ఒరవడికి నాంది పలుకుతోంది. అధికారులు, ఉద్యోగులు సమిష్టి కృషితో ఈ ఆర్థిక సంవత్సరంలో పలు రికార్డులు నమోదు చేయడం విశేషంగా నిలిచింది. సీహెచ్‌పీ ప్రారంభం నాటి నుంచి 2015-16 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 1322 బొగ్గు రేకుల రవాణా, 51.84 లక్షల టన్నుల గరిష్ఠ స్థాయిని ఈ ఏడాది అధిగమించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ముగింపు తేదీకి పది రోజుల ముందుగానే 1323 రేకుల ద్వారా 51.92 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసి కొత్త రికార్డు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 1375 రేకుల రవాణా లక్ష్యంతో 122 శాతం వృద్ధిరేటుతో పనితీరు కొనసాగుతుండటం గమనార్హం. అంతే కాక సంస్థ నిర్దేశించిన 30.57 లక్షల టన్నుల కోల్ లింకేజి బొగ్గు రవాణా లక్ష్యాన్ని నాలుగు నెలల ముందుగానే 2025 నవంబర్‌లోనే సాధించడం మరో విశేషం. నెలవారీగా 135 రేకుల రవాణా అనే రికార్డు స్థాయిని డిసెంబర్, జనవరి నెలల్లోనూ అందుకోవడం సీహెచ్‌పీ సామర్థ్యాన్ని చాటుతోంది. సాధారణంగా ఒక రేక్ బొగ్గు రవాణాకు మూడు గంటల సమయం పడుతుండగా, జీడీకే-1 సీహెచ్‌పీలో సుమారు రెండు గంటల్లోపే రవాణా పూర్తి చేయగలగడం అక్కడి అధికారుల, ఉద్యోగుల సమన్వయానికి నిదర్శనంగా నిలుస్తోంది. డైరెక్టర్ ఆపరేషన్స్, ఈడీ, కోల్ మూమెంట్, మార్కెటింగ్ అధికారుల సమీక్షలు, సూచనలు, కార్పొరేట్ ఉన్నతాధికారుల ప్రోత్సాహం, రైల్వే శాఖతో సమన్వయం ఈ విజయాలకు బలమైన ఆధారంగా నిలిచాయి. అన్ని ఏరియాల గనుల నుంచి బొగ్గు రవాణా వ్యవహారాన్ని నిరంతరం సమీక్షిస్తూ, రైల్వే రేకుల ద్వారా ఎటువంటి ఆలస్యం లేకుండా బొగ్గు నింపి పంపించడం వల్ల ఆలస్య అపరాధ రుసుముల చెల్లింపులు కూడా గణనీయంగా తగ్గినట్లు అధికారులు తెలిపారు. ఇది సమిష్టి కృషి, ప్రణాళికాబద్ధమైన పని తీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భద్రత, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సంస్థ పురోభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ పిలుపునిచ్చారు. బొగ్గు రవాణాలో విశిష్ట కృషి చేస్తున్న ప్రతి సింగరేణి ఉద్యోగికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా ఇంజనీర్ రాంమోహన్, సీహెచ్‌పీ పైడేశ్వర్‌తో పాటు ఏరియాలోని అన్ని గనుల అధికారులు, ఉద్యోగుల పనితీరును ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ అభినందించారు.

## శనేశ్వర స్వామికి శాస్త్రోక్తంగా తిలతైల అభిషేక పూజలు...



నాగర్ కర్నూల్//**మార్చి 21 (ఆకాంక్ష) :** శ్రీ పరాభవ సంవత్సరం చైత్ర మాసం శుక్ల పక్షం తదియ శనివారం నాడు బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహ దోష నివారణకు స్వామి వారికి తిలతైలా అభిషేకలు భక్తితో వేదమంత్రచరణల మధ్య జరిగాయి. శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం నాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు జన్మ రిత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచేనిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ ఆర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన

# ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 21 (ఆకాంక్ష) :** పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా నాగర్‌కర్నూల్ పట్టణంలోని స్థానిక ఈద్గా వద్ద ముస్లిం మైనార్టీ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ముస్లిం సోదరులందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీక అయిన రంజాన్ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, శాంతి నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునంద, వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దపల్లి కార్మిక శాఖ అధికారిణిపై మంత్రికి ఫిర్యాదు...



పెద్దపల్లి//**మార్చి 21 (ఆకాంక్ష) :** పెద్దపల్లి కార్మిక శాఖ అధికారిణి హేమలత భవన నిర్మాణ కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ దళిత బహుజన లేబర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం శనివారం తెలంగాణ రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక వెంకటస్వామికి వినతిపత్రం సమర్పించారు. చెన్నూర్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఈ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కైలాసం మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన ఆర్థిక సహాయాన్ని కార్మిక శాఖ అధికారిణి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్మికుల బెనిఫిట్ బిల్లులను వరుసగా తిరస్కరిస్తూ, అనవసరమైన కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన వాపోయారు. ఇదే అంశంపై గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, వారు అధికారిణిని మందలించినా ఆమె వ్యవహారశైలిలో మార్పు రాలేదని కైలాసం తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల హక్కులను కాలరాస్తున్న అధికారిణిని తక్షణమే బదిలీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రయోజనాలను అర్హులైన కార్మికులకు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దార మధు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో మత సామరస్యానికి

# ప్రతీకగా రంజాన్ వేడుకలు...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 21 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని పీర్లగుట్ట ఈద్గా వద్ద రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ మాసం పవిత్ర ఖురాన్ అవతరించిన మహత్తర కాలమని, ఉపవాస దీక్షలు, ప్రత్యేక నమాజులతో ఈ మాసాన్ని ముస్లింలు ఆచరిస్తారని నాయకులు పేర్కొన్నారు. పరస్పర శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, ప్రేమాభిమానాలకు రంజాన్ గొప్ప సందేశమని తెలిపారు. అల్లా కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, పాడిపంటలతో అభివృద్ధి చెందాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మండలంలోని పలువురు నాయకులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## బాల్యమిత్రుడిని పరామర్శించిన గిరిజన సర్పంచులు...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 21 (ఆకాంక్ష) :** చిన్ననాటి మిత్రుడు, మాజీ సర్పంచ్ రాజు నాయక్ ఇటీవల గుండె బైపాస్ శస్త్రచికిత్స చేయించుకొని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటుండగా, శనివారం గిరిజన సర్పంచులు, మాజీ సర్పంచులు, ఇతర నాయకులు ఆయనను పరామర్శించారు. రాజు నాయక్ ఆరోగ్యం గురించి తెలుసుకుని మనోధైర్యం చెప్పారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తై ఆరోగ్యంగా కోలుకుంటుండటంపై స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాల్యమిత్రుడిని ఆత్మీయంగా కలుసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో గోవిందు నాయక్, చందూలాల్, పుల్యా నాయక్, మునీందర్, గోపాల్ నాయక్, రవి నాయక్, భాషా నాయక్, హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### మహదేవునిపేట ఫీడర్ పరిధిలో

## రేపు విద్యుత్ అంతరాయం...

నాగర్‌కర్నూల్ టౌన్ //**మార్చి 21 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో రేపు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసాచారి తెలిపారు. మహదేవునిపేట ఫీడర్‌లో నూతన కండక్టర్ వైరు మార్పిడి పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం, మార్చి 22న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. బిజినేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని బిజినేపల్లి ఫీడర్, మహదేవునిపేట ఫీడర్‌లకు చెందిన విద్యుత్ వినియోగదారులు, రైతులు ఈ తాత్కాలిక అంతరాయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు. మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రంజాన్ పండుగ సేవాభావానికి ప్రతీక...

### ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు...



మెదక్//**మార్చి 21 (ఆకాంక్ష) :** నర్సాపూర్ మండలంలో పవిత్ర రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు శనివారం స్థానిక ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' అంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ మానవత్వం, సౌభ్రాతృత్వం, సహనం, సేవాభావానికి ప్రతీక అని ఆమె పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం పెద్దలు, యువకులతో మాట్లాడిన ఎమ్మెల్యే వారి క్షేమసమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. పండుగను సోదరభావంతో జరుపుకోవడం సంతోషకరమని, ఇలాంటి పర్వదినాలు సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని ఆమె అన్నారు. రంజాన్ సందర్భంగా ఈద్గా ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే

## మర్రి జనార్ధన్ రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు...



నాగర్‌కర్నూల్ టౌన్/**మార్చి 21 (ఆకాంక్ష) :** ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలతో భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారని పేర్కొన్నారు. శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, ప్రేమాభిమానాల సందేశాన్ని రంజాన్ అందిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## శివపురి కాలనీలో భక్తి పారవశ్యం...

### ఘనంగా నిర్వహించిన రామోత్సవం...

పెద్దపల్లిటౌన్//**మార్చి 21 (ఆకాంక్ష) :** పెద్దపల్లి పట్టణంలోని శివపురి కాలనీలో శనివారం విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి పెద్దపల్లి ప్రకాండ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రామోత్సవం భక్తి పారవశ్య వాతావరణంలో ఘనంగా సాగింది. కాలనీ వాసుల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక ఉత్సాహానికి ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన శ్రీమన్ కొండపాక శ్రీనివాస చార్యులు భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. రామరాజ్య స్థాపనలో మాతృశక్తి పాత్ర అత్యంత కీలకమని, సమాజంలో ధర్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కర్తవ్యబోధతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రకాండ సహ కార్యదర్శి మురళి మాట్లాడుతూ హిందూ ధర్మ ప్రచారంలో మాతృమూర్తుల భాగస్వామ్యం అభినందనీయమని అన్నారు. ప్రకాండ సంయోజక మూల కవిత సారథ్యంలో జరిగిన ఈ ఉత్సవంలో సుమారు 58 మంది మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మాతృశక్తి జిల్లా సంయోజక తారాబాయి, ప్రకాండ సహ సంయోజక రంగు వాణి, సత్సంగ్ ప్రముఖ్ వేదశ్రీ, సేవ ప్రముఖ్ శ్రీవాణి తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములయ్యారు. కాలనీ మహిళలు నిర్వహించిన భజనలు, కీర్తనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తి గీతాల నడుమ శివపురి కాలనీ అంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్యక్రమ నిర్వాహకులు మూల కవిత మాట్లాడుతూ కాలనీవాసుల సహకారంతో రాబోయే రోజుల్లో మరిన్ని ధార్మిక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ రామోత్సవంలో కాలనీ ప్రముఖులు, మాతృశక్తి కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మిడ్జిల్‌లో కారు ఢీకొని యువకుడు మృతి...






జడ్చర్ల//**మార్చి 21 (ఆకాంక్ష) :** మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ శివారులో శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదం 167వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మిడ్జిల్ మండలంలోని రాణిపేట్ గ్రామానికి చెందిన మల్లేష్ (30) వ్యక్తిగత పనుల నిమిత్తం జడ్చర్లకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉన్నాడు. ఈ క్రమంలో కొత్తపల్లి గ్రామ శివారుకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వస్తున్న కారు అతడిని ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ఘటన సమాచారం అందుకున్న ఎస్సై శివ నాగేశ్వర్ నాయుడు వెంటనే సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఒక్క సారిగా జరిగిన ఈ ప్రమాదంతో రాణిపేట్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మల్లేష్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.ం

# బీసీల అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదు...

### బీసీ సబ్ ప్లాన్ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం...

### బీసీలకు న్యాయం చేయని బడ్జెట్ పై ఆకుల స్వామి వివేక్ పటేల్ ఆగ్రహం...



పెద్దపల్లిటౌన్//**మార్చి 21 (ఆకాంక్ష) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3,24,234 కోట్ల తెలంగాణ బడ్జెట్ 2026-27లో బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించలేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్, సామాజిక ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల స్వామి వివేక్ పటేల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో సుమారు 56 శాతం ఉన్న బీసీ సమాజానికి బడ్జెట్‌లో న్యాయం జరగలేదని విమర్శించారు. బీసీల అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించిన ఆయన, ప్రభుత్వం కుల సర్వే ఆధారంగా బీసీల సంఖ్యను గుర్తించినప్పటికీ, అదే ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు చేయక పోవడం విచారకరమన్నారు. మొత్తం రూ.3.24 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీ సంక్షేమ శాఖకు కేవలం రూ.12,511 కోట్లు మాత్రమే కేటాయించడం,అంటే మొత్తం బడ్జెట్‌లో సుమారు 3 శాతం మాత్రమే ఇవ్వడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. గత బడ్జెట్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నదని పేర్కొంటూ 2024-25లో రూ.8,229 కోట్లు కేటాయించి సుమారు రూ.2,080 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, 2025-26లో రూ.11,400 కోట్లు కేటాయించినప్పటికీ సుమారు రూ.3,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన పరిస్థితి ఉందన్నారు. ఈ గణాంకాలు చూస్తే 2026-27లో కూడా కేటాయింపులు చేసినంత మేర బీసీలకు ప్రయోజనం అందే పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. బడ్జెట్‌లో బీసీ సబ్ ప్లాన్ లేకపోవడం, కుల గణన ఆధారంగా ప్రత్యేక నిధుల కేటాయింపులు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తున్నాయని ఆకుల స్వామి వివేక్ పటేల్ ఆరోపించారు. రాష్ట్రంలో మెజారిటీ వర్గంగా ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన వాటా ఇవ్వకుండా కేవలం సంక్షేమ ప్రకటనలతో సరిపెట్టడం సరైంది కాదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రతి సంవత్సరం బీసీల అభివృద్ధికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, గత రెండు సంవత్సరాల్లో కలిపి రూ.5 వేల కోట్లు కూడా పూర్తిగా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఇది అమలు లోపమా, లేక బీసీల పట్ల నిర్లక్ష్యమా అన్నది ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఫ్రీ బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత విద్యుత్, పెన్షన్లు వంటి పథకాల ద్వారా తాత్కాలిక ఉపశమనం లభించినా, బీసీలకు స్థిరమైన ఆర్థిక సాధికారత కల్పించే విధానాలు ప్రభుత్వం చేపట్టడం లేదన్నారు. ఎంతకాలం బీసీలు సబ్సిడీలపై ఆధారపడాలని, వారిని స్వావలంబన వైపు నడిపించే విధానాలు ఎప్పుడు తీసుకొస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ, పెట్టుబడులు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి భారీ ప్రాజెక్టులు ప్రధానంగా కార్పొరేట్ సంస్థలు, అగ్రవర్గాలకు మాత్రమే లాభం చేకూర్చేలా ఉన్నాయని ఆయన విమర్శించారు. బీసీలకు పరిశ్రమల్లో భాగస్వామ్యం లేకపోవడం, వ్యాపార రంగంలో ప్రోత్సాహం అందకపోవడం వల్ల వారు అభివృద్ధి ప్రధాన ప్రవాహం నుంచి దూరమవుతున్నారని అన్నారు. బడ్జెట్‌లో సంప్రదాయ కుల వృత్తులు, సంచార జాతులు, చిన్న వ్యాపారులు, కౌలు రైతులు, చిన్న రైతుల కోసం ఎలాంటి స్పష్టమైన ప్రణాళిక కనిపించడం లేదన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులు, చిన్న రైతులలో అధిక సంఖ్యలో బీసీలే ఉన్నప్పటికీ, అందరికీ ఒకే విధానమనే పేరుతో భూమి ఎక్కువగా ఉన్న వర్గాలకు ఎక్కువ సబ్సిడీలు వెళు తున్నాయని విమర్శించారు. భూమి లేని సుమారు 50 లక్షల నిరుపేద బీసీ కుటుంబాలకు సరైన ప్రయోజనం అందడం లేదని తెలిపారు. విద్య, ఉద్యోగ రంగాల్లో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. బీసీ విద్యార్థులకు ప్రత్యేక విద్యా సహాయం లేకపోవడం, స్కాలర్‌షిప్ బకాయిలు సుమారు రూ.15 వేల కోట్లు చెల్లించకపోవడం, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజుల చెల్లింపులు లేకపోవడం, ఉద్యోగ నియామకాల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కాకపోవడం, స్వయం ఉపాధి కోసం బీసీ కార్పొరేషన్లకు తగిన నిధులు లేకపోవడం వంటి అంశాలు బీసీ సమాజాన్ని మరింత వెనక్కి నెడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో బీసీల సమగ్ర అభివృద్ధి కోసం కనీసం రూ.30 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించి బీసీ సబ్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేయాలని ఆకుల స్వామి వివేక్ పటేల్ డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్లను బలోపేతం చేసి యువతకు సబ్సిడీ రుణాలు, వ్యాపార ప్రోత్సాహకాలు, నైపుణ్యాభివృద్ధి పథకాలు అమలు చేయాలని సూచించారు. మాటల్లో అంబేద్కర్ పేరు చెప్పి చేతల్లో బీసీలను పట్టించుకోని విధానం కొనసాగుతోందని మండిపడిన ఆయన, గత 78 సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయన్నారు. బీసీలు మేల్కొని ఐక్యంగా పోరాడకపోతే ఈ అన్యాయం ఎప్పటికీ ఆగదని హెచ్చరించారు. ఈ బడ్జెట్ బీసీ మెజారిటీ ప్రజల అభివృద్ధిని విస్మరించి, కొందరికి మాత్రమే అవకాశాలు కల్పించే బడ్జెట్‌గా మిగిలిపోయిందని ఆకుల స్వామి వివేక్ పటేల్ విమర్శించారు.

# ఓదెలలో అవయవ దాత బుద్దే పోశెట్టి సంస్మరణ సభ...

### కుటుంబ సభ్యులకు ఘన సన్మానం...

### అవయవదానంపై అవగాహన కార్యక్రమం...



ఓదెల//**మార్చి 21 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలానికి చెందిన అవయవ దాత బుద్దే పోశెట్టి సంస్మరణ సభను ఆయన కుటుంబ సభ్యులు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రమాదవశాత్తు మరణించిన పోశెట్టి అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించడం సమాజానికి ఆదర్శప్రాయంగా నిలిచిందని సభలో పాల్గొన్న పలువురు అభిప్రాయపడ్డారు. పోశెట్టి కుమారులు బుద్దే రాకేష్, కార్తీక్, అల్లుడు సంతోష్-పావని తీసుకున్న అవయవదాన నిర్ణయం మానవతా విలువలకు నిదర్శనమని వక్తలు కొనియాడారు. ఒక వ్యక్తి మరణానంతరం కూడా పలువురికి ప్రాణదానం చేయగలిగే అవయవదానం అత్యున్నత సేవ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభలో బంధుమిత్రులకు నేత్రదానం, అవయవదానం, శరీరదానం వంటి మహత్తర సేవల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సమాజంలో మరింత మంది అవయవదానంపై ముందుకు రావాలని, ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ కనికిరెడ్డి సతీష్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, మీసా అర్జున్ రావు, దొమ్మటి పోశెట్టి, గుండేటి ఐలయ్య యాదవ్ తదితరులు పోశెట్టిగారి సేవాస్ఫూర్తిని స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులు తీసుకున్న మహోన్నత నిర్ణయాన్ని వారు అభినందిస్తూ, అవయవదానం ద్వారా సమాజానికి ఒక గొప్ప సందేశం వెళ్లిందన్నారు. అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు భార్య రమాదేవి, కుమారులు రాకేష్, కార్తీక్, అల్లుడు సంతోష్, పావని వారికి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల సేవాభావాన్ని కొనియాడుతూ సభికులు చప్పట్లతో అభినందించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు చంద్రమౌళి, ప్రతినిధులు అల్లం సతీష్, క్యాతం మల్లేశం, మెరుగు సారంగం, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, పోలోజు రమేష్, చింతం వెంకటస్వామి, బి.నరేష్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులను అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. అవయవదానం వంటి మహత్తర సేవపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి సంస్మరణ సభలు దోహదపడతాయని, బుద్దే పోశెట్టి కుటుంబం చూపిన స్ఫూర్తి మరెందరికో మార్గదర్శకంగా నిలుస్తుందని సభలో పాల్గొన్నవారు పేర్కొన్నారు.

## మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది...

### రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి...



జడ్చర్ల//**మార్చి 21 (ఆకాంక్ష) :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్, కావేరమ్మపేట తదితర ప్రాంతాల్లో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని వారికి హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ పండుగ సోదరభావం, ఐక్యత, ప్రేమ, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో పరస్పర గౌరవం, మానవతా విలువలను పెంపొందించే పవిత్ర పర్వదినంగా రంజాన్‌కు విశిష్ట స్థానం ఉందన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటికి శాంతి, సౌభాగ్యం, ఆనందం తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా మైనార్టీ వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. వేడుకల సందర్భంగా స్థానిక ముస్లిం పెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాకతో కార్యక్రమ ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ముస్లిం సోదరులతో ఆత్మీయంగా మమేకమైన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇద్దరికి వెలుగునిచ్చిన మొండయ్య కుటుంబం...



ఓదెల//**మార్చి 21 (ఆకాంక్ష) :** ఓదెల గ్రామానికి చెందిన గడిగొప్పుల మొండయ్య అనారోగ్యంతో మృతి చెందగా, తీవ్ర విషాదంలోనూ ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేసి మానవత్వానికి చిరస్మరణీయమైన ఉదాహరణగా నిలిచారు. కుటుంబ సభ్యుల ఈ నిర్ణయంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం కలిగింది. మొండయ్య మరణంతో కుటుంబంలో విషాదం నెలకొన్న వేళ, గడిగొప్పుల నరేష్ కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించగా వారు సానుకూలంగా స్పందించారు. అనంతరం సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి ఆధ్వర్యంలో, ఎల్‌వీపీ టెక్నీషియన్ గాజుల సతీష్ సహకారంతో మొండయ్య కార్నియాలను సేకరించి హైదరాబాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు దృష్టి లోపం ఉన్న వారికి వెలుగు అందనుందని వైద్య సిబ్బంది తెలిపారు. బాధాకర సమయంలోనూ సమాజానికి ఉపయోగపడేలా కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ నిర్ణయం అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు మొండయ్య కుటుంబ సభ్యులను అభినందించారు. మృతుని భార్య మల్లక్క, కుమారులు రాకేష్, గణేష్ తీసుకున్న ఈ మహోన్నత నిర్ణయాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహా దారులు రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు చంద్రమౌళి, ఖ్యాతం మల్లేశం, మెరుగు సారంగం, అల్లం సతీష్, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, కొంద్ర వేణు తదితరులు అభినందిస్తూ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.ం

## జడ్చర్లలో అమృత్ 2.0 పనులకు శంకుస్థాపన...

### పోచమ్మగుడి ఊర చెరువు అభివృద్ధికి రూ.1.11 కోట్లు...



జడ్చర్ల//**మార్చి 21 (ఆకాంక్ష) :** జడ్చర్ల పట్టణంలోని పోచమ్మగుడి ఊర చెరువు అభివృద్ధి పనులకు అమృత్ 2.0 పథకం కింద రూ.1 కోటి 11 లక్షల నిధులతో శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఎంపీ డీకే అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, అమృత్ పథకం ద్వారా జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి వివిధ పనుల కింద మొత్తం రూ.47 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. పట్టణాల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకాన్ని అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని, ఇందులో 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. ప్రజలకు ప్రాథమిక వసతులు మెరుగ్గా అందించడమే అమృత్ 2.0 ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధి వంటి పనులు దశలవారీగా చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మంజూరైన పనులు ఆశించిన స్థాయిలో సాగడం లేదని, కొన్ని చోట్ల నత్తనడకన కొనసాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు పనులను శరవేగంగా పూర్తి చేయాలని, మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం అయ్యేలా చూడాలని సూచించారు. అనంతరం రాష్ట్ర బడ్జెట్‌పై కూడా ఎంపీ డీకే అరుణ విమర్శలు గుప్పించారు. రాష్ట్ర బడ్జెట్ "కొత్త సీసాలో పాత సారా" లా ఉందని వ్యాఖ్యానించారు. గత బడ్జెట్‌తో పోల్చితే పెద్దగా మార్పులు లేవని, కేవలం స్వల్ప సవరణలతోనే మళ్లీ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు గురించి స్పష్టత ఇవ్వలేదని, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, ఆసరా పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్ల మంజూరు వంటి హామీలపై బడ్జెట్‌లో స్పష్టమైన ప్రస్తావన లేదని విమర్శించారు. జాతీయ గీతం అవమానానికి సంబంధించిన ఘటనపైనా ఆమె స్పందిస్తూ, భారతీయులందరికీ జాతీయ గీతానికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. జాతీయ గీతాన్ని అవమానించి అసెంబ్లీ నుంచి బయటకు రావడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో వారు చెప్పాలని డిమాండ్ చేశారు. జడ్చర్ల పట్టణాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకుని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై ఉందని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. పోచమ్మ గుడి ఊర చెరువు అభివృద్ధి పనులు పూర్తయితే స్థానికులకు మెరుగైన వసతులతో పాటు ప్రాంత సౌందర్యం కూడా పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

### ముస్లిం సోదరులకు రంజాన్

## శుభాకాంక్షలు తెలిపిన ఎస్సై దీకొండ రమేష్...



ఓదెల//**మార్చి 21 (ఆకాంక్ష) :** ఓదెల మండలం పోత్కపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా స్థానిక ఎస్సై దీకొండ రమేష్ గౌడ్ ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముస్లిం పెద్దలు, యువకులు, చిన్నారులతో ఆత్మీయంగా మమేకమై పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. రంజాన్ పర్వదినం శాంతి, సౌహార్దానికి ప్రతీకగా నిలుస్తుందని ఎస్సై దీకొండ రమేష్ పేర్కొన్నారు. సమాజంలో అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి సోదరభావంతో పండుగలను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈద్ వంటి పర్వదినాలు పరస్పర గౌరవం, ఐక్యత, సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ వేళ సామాజిక ఐక్యతను చాటే విధంగా ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.